నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 28-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:73 పేజీలు:4 వెల: రూ.1/-

సిద్దిపేట ఘటనతో సర్వత్రా ఉద్రిక్తత

పట్టణంలో హాట్ టాపిక్‌గా మారిన ఘటన
బిజెపి నేతల ముందస్తు అరెస్టులు
ఘటనపై కేంద్ర బిజెపి నేతల ఆరా

బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్‌పై సిద్దిపేటలో పోలీసులు దురుసుకు నిరసనగా ఖమ్మంలో ఆందోళనకు దిగిన బిజెపి నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు

సిద్దిపేట,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికకు సంబంధించి సిద్దిపేటలో పోలీసులు చేసిన సోదాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఓ వ్యక్తి ఇంట్లో దొరికిన డబ్బును బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు ఇచ్చేందుకే తెచ్చారని పోలీసులు చెప్పడం, డబ్బు సంచితో కనిపించిన కొందరు పోలీసులను బీజేపీ నేతలు అడ్డుకోవడంతో నెలకొన్న ఉద్రిక్తత ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనతో పట్టణంలో బిజెపి కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఎక్కడా ఎలాంటి ఘటనలు జరక్కుండా పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

బిజెపి నేతలను ముందస్తు అరెస్ట్ చేసారు. దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు మామ, బంధువుల ఇళ్లలో పోలీసుల దాడిపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ ఘటనపై...అలాగే పోలీసుల తీరుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసే యోచనలో అభ్యర్థి రఘునందన్ రావు ఉన్నట్లు తెలస్తోంది. దుబ్బాక ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పరిణామాలను బీజేపీ కేంద్ర పెద్దలు నిశితంగా పరిశీలిస్తున్నారు.

అటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఇటు అభ్యర్థి రఘునందన్ రావుకు కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితులపై అరా తీస్తున్నారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగంపై ఆరోపణల నేపథ్యంలో కేంద్ర బలగాలను మోహరించి ఎన్నికలు జరపాలని బీజేపీ నుంచి డిమాండ్ వస్తున్నట్లు సమాచారం.

స్థానిక లెక్చరర్స్ కాలనీలో దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు మామ సురభి రాంగోపాల్ రావుతో పాటు వారి ఇంటి పక్కన ఉన్న అంజన్ రావు ఇంట్లో పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టడం, డబ్బుల దొరికాయని పోలీస్ కమిషనర్ ప్రకతించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు ఇంట్లోనూ సోదాలు జరిపామని చెప్పిన తీరు కూడా అనుమానాలకు తావిస్తోంది. అంజన్‌రావు ఇంట్లో మాత్రం రూ. 18.60 లక్షలు స్వాధీనం చేసుకున్నామని,అది రఘునందన్ రావుకు ఇచ్చేందుకే తెచ్చినట్లుగా గుర్తించామని పోలీసులు చెప్పారు.

ఇదే సమయంలో అంజన్‌రావు ఇంటి ముందు డబ్బు సంచితో ఓ కానిస్టేబుల్ కనిపించడంతో బీజేపీ కార్యకర్తలు పట్టుకున్నారు. ఆయన చేతిలోంచి సంచి లాక్కొని అందులోని నోట్ల కట్టలను మీడియాకు చూపించారు. పోలీసులే డబ్బు తెచ్చి సోదాల్లో దొరికినట్లు చూపుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీజేపీ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఆ తర్వాత బీజేపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తదితరులు సిద్దిపేటకు వెళ్లగా వారిని అరెస్టు చేశారు. బండి సంజయ్‌ను బలవంతంగా వ్యాన్‌లోకి తోశారు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. దాడికి నిరసనగా సంజయ్ కరీంనగర్‌లో దీక్షకు దిగారు. దాదాపు నాలుగు గంటల పాటు సోదాలు నిర్వహించినా డబ్బులు దొరకక పోవడంతో వారి ఇంటి పక్కనే ఉన్న సురభి అంజన్ రావు ఇంట్లో తనిఖీలు చేశారు. అటు తర్వాత అంజన్ రావు ఇంట్లో రూ. 18.65 లక్షలు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పోలీసులు ప్రకటించారు.

ఎలాంటి నోటీసులు లేకుండా తన మామ రాంగోపాల్‌రావు ఇంట్లో ఎలా సోదాలు నిర్వహిస్తారని, తనకేమాత్రం పరిచయం లేని అంజన్ రావు అనే వ్యక్తి దగ్గర దొరికిన డబ్బులు తనవేనని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ సైదులును రఘునందన్ రావు ఎన్నిసార్లు ప్రశ్నించినా.. ఆయన నుంచి సరైన సమాధానం రాలేదు. నిబంధనల ప్రకారం ముందస్తుగా నోటీసులు ఇచ్చి తనిఖీలు చేయాలని, కానీ పోలీసులు ఇవేమీ పాటించకుండా టీఆర్ఎస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని రఘునందన్‌రావు ఆరోపించారు.

సిద్దిపేటలో రఘునందన్ మామ రాంగోపాల్‌రావు ఇంట్లో పోలీసులు సోదా చేస్తున్నారనే సమాచారం అందుకున్న బీజేపీ కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి హరీశ్ రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలుమార్లు పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది.

సోదాల్లో రూ. 18.67 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు సిద్దిపేట సీపీ జోయల్ డేవిస్ చెప్పారు. సిద్దిపేటలో మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సురభి రాంగోపాల్ రావుతో పాటు సురభి అంజన్‌రావు ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు వివరించారు. రఘునందన్‌రావుకు రాంగోపాల్‌రావు, అంజన్‌రావు బంధువులని, అంజన్ రావు ఇంట్లో దొరికిన డబ్బులను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ సమక్షంలో సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన డబ్బులను అధికారులకు అప్పగించడానికి తరలిస్తున్న సమయంలో అక్కడ రఘునందన్ రావుతో పాటు ఆందోళనచేస్తున్న వారిలో 20 మంది వరకు ఇంట్లోకి చొరబడి అధికారుల నుంచి రూ. 12.80 లక్షలు దొంగిలించుకుని వెళ్లిపోయారని చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి వీడియో రికార్డుల ప్రకారం ఎంక్వైరీ చేస్తున్నామని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తంగా ఈ వ్యవహారం ఇప్పుడు బిజెపి, టి ఆర్ ఎన్ ల మధ్య ఉద్రిక్తతలకు దారితీసింది. దీంతో బిజెపి నేతలు నిరసనలకు దిగారు.

ప్రగతిభవన్‌కు అనుమతి లేదు

డికె తదితరులకు పోలీసుల స్పష్టీకరణ

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఎన్నికల ప్రచారానికి వెళ్ళేందుకు బీజేపీ నేతలు డీకే అరుణ, మోత్కుపల్లికి పోలీసులు అనుమతినిచ్చారు. ప్రగతి భవన్‌కు వెళ్ళొద్దంటూ వారికి ఎస్కార్ట్ వాహనం ఇచ్చి పోలీసులు పంపించారు. అంతకు ముందు డీకే అరుణ ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. దుబ్బాక ప్రచారానికి వెళ్లాలని చెప్పినప్పటికీ బయటకు రావొద్దంటూ పోలీసులు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లాల్సిందే అని డీకే అరుణ పట్టుబట్టారు. చివరకు పోలీసులు ఇరువురు నేతలకు ఎన్నికల ప్రచారానికి వెళ్లేందుకు అనుమతినిచ్చారు.

బండి సంజయ్‌కు అమిత్ షా ఫోన్

తాజా ఘటనలపై ఆరా తీసిన కేంద్రమంత్రి

న్యూఢిల్లీ,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ చేశారు. సంజయ్ అరెస్టుతోపాటు సిద్దిపేట ఘటనపై ఆయన ఆరా తీశారు. రఘునందన్ రావుకు మద్దతు తెలిపేందుకు దుబ్బాక వెళుతున్న సమయంలో సంజయ్‌ను పోలీసులు అరెస్టు చేసి కరీంనగర్‌కు తరలించారు. ఆ సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజయ్‌కు మద్దతుగా బీజేపీ నేతలు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.

పెండింగ్ పనులు సత్వరం పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి ఎర్రబెల్లి ఆదేశాలు

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పెండింగ్ పనుల ప్రగతి, రైతు వేదికల నిర్మాణం, పీఎంజీఎస్‌వై రోడ్ల పనులపై ఉన్నతాధికారులతో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు.

నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు వేదికలు, రోడ్లు, ఇతర పనులన్నీ నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా జరిగేలా చూడాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని చెప్పారు. కరోనా నేపథ్యంలో ఆగిపోయిన పనులన్నింటిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు.

కరోనాతో పోరాడుతున్న వైద్యులకు జీతాలు ఇవ్వరా?

నగరపాలక సంస్థ తీరుపై మండిపడ్డ ఢిల్లీ సిఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): కోవిడ్-19 మహమ్మారిపై ముందు వరుసలో ఉండి పోరాడుతున్న వైద్యులకు జీతాలు చెల్లించకపోవడంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది నెలలుగా కొందరు మునిసిపల్ డాక్టర్లకు జీతాలు చెల్లించకపోవడంతో వారు ధర్నా చేస్తున్నారని, ఇది మనందరికీ సిగ్గు చేటు అని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో రాజకీయాలు చేయరాదన్నారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించలేనంతగా నగర పాలక సంస్థలో కొరత ఏం వచ్చిందని ప్రశ్నించారు. ఉత్తర ఢిల్లీ నగర పాలక సంస్థ (ఎన్‌డీఎంసీ) నిర్వహిస్తున్న ఆసుపత్రులలోని సీనియర్ డాక్టర్లు సోమవారం సామూహిక కాజువల్ లీవ్ పెట్టిన సంగతి తెలిసిందే. సమీప భవిష్యత్తులో పరిష్కారం కనిపించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైద్యులు తెలిపారు. మునిసిపల్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఆర్ గౌతమ్ సోమవారం మాట్లాడుతూ, తమ డిమాండ్లు నెరవేరకపోతే తాము మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తామని చెప్పారు. హిందూ రావు ఆసుపత్రిలోని ఐదుగురు రెసిడెంట్ డాక్టర్లు శుక్రవారం నుంచి నిరాహార దీక్ష చేస్తున్నారు. తమ పెండింగ్ జీతాలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యను ఎవరూ పరిష్కరించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ తెలిపింది.

రక్త దాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అరూరి

వరంగల్. అక్టోబర్ 27: రక్తదానం ప్రాణదానంతో సమానమని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా వర్ధన్నపేట డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తం లభించక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారిని ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త దానం చేయాలని పిలుపునిచ్చారు. మనం చేసే ఒక యూనిట్ రక్తం ఒక మనిషి ప్రాణాన్ని కాపాడవచ్చని ఆయన తెలిపారు. అనంతరం స్వచ్ఛందంగా రక్త దానం చేసిన యువతను అభినందించి వారికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసిపి రమేష్, ఎంపిపి అన్నమనేని అప్పారావు, జడ్పిటీసి మార్గం బిక్షపతి, టీఆరెస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, వర్ధన్నపేట సిఐ విశ్వేశ్వర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రగతి భవన్ వద్ద భారీగా పోలీసుల మోహరింపు

బండిపై పోలీసుల తీరుకు నిరసనగా నిరసనలు
ఎక్కడికక్కడ బిజెపి నేతల అరెస్ట్..గృహనిర్బంధం

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): సిద్దిపేటలో బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ బిజెపి ఆందోళనలకు దిగింది. దీంతో ప్రగతి భవన్ వద్ద భారీగా పోలీసులు భారీగా మోహరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పై పోలీసుల దాడికి నిరసనగా మంగళవరాం చలో ప్రగతి భవన్‌కు ఎబివిపి, బిజేవైఎం పిలుపు నిచ్చిన నేపథ్యంలో వందల సంఖ్యలో ప్రగతి భవన్ పరిసరాల్లో పోలీసులు మోహరించారు. అలాగే తెలంగాణా భవన్ వద్ద కూడా పోలీసులు మొహరించారు. ఇక మరో పక్క కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో స్వీయ నిర్బంధంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దీక్ష

కొనసాగుతోంది. కార్యాలయానికి తాళం వేసుకుని ఆయన నిర్బంధంలో ఉన్నారు. సిద్దిపేట సీపీని సస్పెండ్ చేయాలంటూ సంజయ్ దీక్షకు దిగారు. సిద్దిపేటలో సోమవారం రాత్రి పోలీసుల తీరుకు నిరసనగా దీక్షకు సంజయ్ దిగారు. సిద్దిపేట ఘటనపై నిన్న అమిత్ షా ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా కూడా ఆందోళనలకు పార్టీ శ్రేణులు ఆందోళనలకు సిద్ధం అయ్యాయి. సంజయ్ దీక్షకు సంఘీభావం తెలపడానికి డి కె అరుణ, ఎంపీ సాయం బాబు రావు, బాబూ మోమన్ తదితరులు కరీంనగర్ వెళ్లారు. సంజయ్ దీక్ష పై ఆరా తీస్తున్న పోలీసులు దీక్ష కేంద్రం వద్ద నిఘా ఏర్పాటు చేశారు. ఇకపోతే రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్సీ రామచంద్రరావు, ఎంపి ధర్మపురి అర్వింద్, జితేందర్ రెడ్డి, వివేక్ తదితరులను గృహనిర్బంధం చేశారు. మెదక్‌లో బిజెపి కార్యకర్తలు ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కెసిఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్ని గ్రామాలు, మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు నిరసన చేస్తున్నారు. కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై దురుసుగా ప్రవర్తించిన సీపీని సస్పెండ్ చేసి, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. ఛలో ప్రగతి భవన్ ముట్టడికి బీజేపీ నేతలు పిలునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్‌లు చేస్తున్నారు. ఎమ్మెల్సీ రామచంద్రరావు, రాజసింగ్, మోత్కుపల్లి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించారు. బయటకు వెళ్ళటానికి వీలు లేదని పోలీసులు స్పష్టం చేశారు. అలాగే ప్రగతి భవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

పోలీస్‌ల తీరుపై ఎంపి మండిపాటు

పోలీసుల తీరుపై బీజేపీ ఎంపీ అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇంటి ముందు పోలీసులు మోహరించడంతో బయటకు వచ్చిన ఆయన పోలీసులపై మండిపడ్డారు. దీంతో వారు దూరంగా జరిగారు. ఈ సందర్భంగా ఎంపీ ఏసీపీకి ఫోన్ చేసి మాట్లాడారు. తన ఇంటి ముందు పోలీసులు ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. అందుకు సమాధానంగా ఛలో ప్రగతి భవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇవ్వడంతో బీజేపీ నేతలను ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్‌లు చేస్తున్నామని చెప్పడంతో ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ప్రగతి భవన్ ముట్టడికి పిలుపు ఇవ్వలేదని అన్నారు. అసలు సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో ఉన్నారా? ఫాంహౌస్‌లో ఉన్నారా? అని అరవింద్ ప్రశ్నించారు.

సిద్దిపేట ఘటన సిగ్గుచేటు

సిద్దిపేటలో పోలీసులు ప్రవర్తించిన తీరు సిగ్గుచేటుగా ఉందని బీజేపీ నేత వివేక్ వ్యాఖ్యానించారు. ఇవాళ ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన.. పోలీసుల్ని సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ కేడర్‌లా వాడుకుంటున్నారని ఆరోపించారు. దుబ్బాకలో గెలుస్తామనే నమ్మకం ఉంటే టీఆర్ఎస్ పోలీసులను ఎందుకు వాడుకుంటోంది? అని వివేక్ ప్రశ్నించారు. 'సీఎం కేసీఆర్ పిరికి పంద.. అందుకే పోలీసులతో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కాలని చూస్తున్నారు. ఓడిపోతామనే భయంతోనే రఘునందన్‌ను కేసులో ఇరికించే యత్నిస్తున్నారు. దుబ్బాకలో కాళేశ్వరం కమిషన్ల డబ్బుతో..ఓట్లు కొనాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు' అని వివేక్ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ ఎంపీ, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ అరెస్ట్‌తో తెలంగాణ వ్యాప్తంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు, ఏబీవీపీ, బీజేవైఎం నాయకులు ఆందోళనలు చేపట్టిన విషయం విదితమే.

మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు అవాస్తవం

పోలీసులు సెర్చ్ వారెంట్ ఇచ్చే సోదాలు చేశారు
పోలీసుల నుంచి డబ్బు లాక్కెళ్లిన వారిపై కేసులు
వివరాలు వెల్లడించిన కమిషనర్ జోయల్

సిద్దిపేట,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేటలో సోమవారం చోటు చేసుకున్న ఘటనలో పోలీసులపై మీడిచా ఛానెల్స్, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవమని సిద్దిపేట సీపీ జోయల్ డేవీస్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కమిషనర్ జోయల్ డేవీస్ మంగళవారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు. ముందస్తు సమాచారంతోనే సోమవారం సోదాలు నిర్వహించామన్నారు. ఎగ్జిక్యూటివ్ అధికారి సర్చ్ వారెంట్ ఇచ్చాకే సోదాలు చేశామన్నారు. సోదాలపై అధికారులు పంచనామా కూడా తయారు చేశారు. ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ బయటకు వచ్చే సమయంలో బీజేపీ కార్యకర్తలు దాడి చేశారు. తమ సిబ్బందే డబ్బు పెట్టినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఎక్కువ మంది ఉండటం వల్లే నగదు లాక్కెళ్తున్నా అడ్డుకోలేకపోయామని సీపీ తెలిపారు. సోమవారం నాటి ఘటనలో ఐదుగురిని గుర్తించి, మరో 20 మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ఘటనంతా సురభి అంజన్ రావు ఇంట్లోనే జరిగిందని సీపీ పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. డబ్బు దొరికిన ఇంటి యజమానితో పాటు పంపించిన వ్యక్తి సంతకాలు తీసుకున్నారు. సీజ్ చేసిన నగదును లాక్కెళ్లడం పెద్ద నేరమని సీపీ తెలిపారు. సురభి అంజన్ రావు నివాసంలోనే నగదు దొరికిందని ఆయన స్పష్టం చేశారు. నాలుగు ప్రదేశాల్లో సోదాలు చేస్తే ఒకరి వద్దే డబ్బు దొరికిందని తెలిపారు. ఎన్నికల సంఘం పరిధిలోనే తాము పని చేస్తున్నామని సీపీ పేర్కొన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని బండి సంజయ్‌కు ముందస్తుగానే సమాచారం ఇచ్చామని చెప్పారు. సిద్దిపేటకు రావొద్దని ముందుగానే ఫోన్ చేసి కోరానని సీపీ తెలిపారు. బండి సంజయ్‌తో దురుసుగా ప్రవర్తించలేదని ఆయన స్పష్టం చేశారు. దుబ్బాక ప్రచారానికి వచ్చే ఎవరిని అడ్డుకోవట్లేదు అని తెలిపారు. అయితే ప్రణాళిక ప్రకారమే పోలీసులపై దాడి చేశారు. దుబ్బాక ఉప ఎన్నిక దృష్ట్యా పూర్తి అప్రమత్తంగా ఉన్నామని చెప్పారు. సిబ్బంది పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని సీపీ కోరారు. ఎన్నికల నిబంధనల ప్రకారమే పనిచేస్తున్నామని.. నిన్న ఏం జరిగింది అనేది ఎన్నికల కమిషన్‌కి...డిజీపీకి నివేదిక పంపించానన్నారు. వీడియో ఆధారాలు సేకరించి రిమాండ్ తరలిస్తామని పేర్కొన్నారు. నా పై ఫిర్యాదు చేసినా... ఎన్నికల కమిషన్ ఏం జరిగింది అనే నివేదిక అడుగుతారు కదా అని పేర్కొన్నారు. ఏ పార్టీ ఫిర్యాదు చేసినా తనిఖీలు చేశామని.. పోలీసుల మీద నమ్మకం లేకపోతే...జిల్లా కలెక్టర్..ఎన్నికల పరిశీలకులకు కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. తాము ఎన్నికల కమిషన్ పరిధిలో పనిచేస్తున్నామని వెల్లడించారు. మాపై ఫిర్యాదు చేసిన వాళ్ళ తనిఖీల్లో చాలా చోట్ల డబ్బులు దొరకలేదన్నారు.

దివంగత నాయిని సతీమణి అహల్య భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన మంత్రులు కెటిఆర్, తలసాని, మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

అరబిందో ఫార్మా 5కోట్ల విరాళం

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): హైదరబాద్ వరద బాధితులను ఆదుకునేందుకు అరబిందో ఫార్మా కంపెనీ ముందుకు వచ్చింది. వరద బాధితులకు సహాయక చర్యల కోసం అరబిందో ఫార్మా రూ. 5 కోట్ల విరాళం ప్రకటించింది. ఈ మేరకు ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను అరబిందో ఫార్మా కంపెనీ ప్రతినిధులు కలిసి చెక్కును అందజేశారు. మీనాక్షి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ కూడా ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 2 కోట్ల విరాళం ప్రకటించింది. ఈ కంపెనీ ప్రతినిధులు కూడా కేటీఆర్‌కు చెక్కు అందజేశారు. అరబిందో ఫార్మా, మీనాక్షి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణలో మరో రెండు భారీ పెట్టుబడులు

700 కోట్ల పెట్టుబడులకు లారస్ ల్యాబ్స్, గ్రాన్యూల్ అంగీకారం
మంత్రి కెటిఆర్‌తో భేటీ...పెట్టుబడులపై చర్చ

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల పరంపర కొనసాగుతోంది. హైదరాబాద్ నగరానికి మరో రెండు భారీ పెట్టుబడులు వచ్చాయి. ఈ సందర్భంగా ప్రగతి భవన్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ను లారస్ ల్యాబ్స్, గ్రాన్యూల్స్ ఇండియా కంపెనీల ప్రతినిధులు కలిశారు. జినోమ్ వ్యాలీలో రూ. 700 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు రెండు కంపెనీలు వెల్లడించాయి. మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ల కోసం గ్రాన్యూల్స్ ఇండియా రూ. 400 కోట్లు, లారస్ ల్యాబ్స్ రూ. 300 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ కంపెనీల పెట్టుబడుల ద్వారా 1750 మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. ఈ రెండు కంపెనీలకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి కేటీఆర్.. అన్ని రకాలుగా ప్రభుత్వం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన లారస్ ల్యాబ్స్, గ్రాన్యూల్స్ ఇండియా కంపెనీలను మంత్రి కేటీఆర్ స్వాగతించారు. రెండు కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం నుంచి కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తెలంగాణ అనేక రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు కొనసాగుతున్నాయని, దీనికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అద్భుతమైన పారిశ్రామిక పాలసీలు కలిగి ఉండటమేనని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ విధానాల వలన ఐటీ, ఫార్మా, టెక్స్ టైల్స్, ఏరోస్పేస్, డిఫెన్స్‌తో పాటు ఇతర రంగాల్లో అనేక పెట్టుబడులు వస్తున్నాయని, ఈ రోజు తెలంగాణకు రానున్న ఈ రెండు పెట్టుబడుల ద్వారా తయారీ రంగంలో పెద్ద ఎత్తున స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందన్న ఆశాభావాన్ని మంత్రి కేటీఆర్ వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరానికి చెందిన గ్రాన్యూల్స్ ఇండియా రూ. 400 కోట్ల పెట్టుబడితో 10 బిలియన్ ఫినిష్డ్ డోసులను తయారు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ పెట్టుబడి ద్వారా సుమారు 16 వందల మందికి ఉపాధి లభిస్తుందని కంపెనీ తెలిపింది. గ్రాన్యూల్స్ ఇండియా ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది ప్రాంతాల్లో తయారీ యూనిట్లను కలిగి ఉంది. మొత్తం 75 దేశాల్లో తమ కార్యకలాపాలను కొనసాగిస్తుంది. ఇప్పటికే ఈ కంపెనీ ప్రపంచంలోనే అతిపెద్ద కమర్షియల్ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ ఇంటర్మీడియట్ యూనిట్ ని హైదరాబాద్ కి దగ్గర్లో ఉన్న గాగిల్లాపూర్ వద్ద కలిగి ఉన్నది. తమ కంపెనీకి సంబంధించిన పెట్టుబడిని అధికారికంగా ప్రకటించేందుకు కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణప్రసాద్ ప్రగతిభవన్లో మంత్రి కేటీఆర్ కలిశారు. లారస్ ల్యాబ్స్ కు సంబంధించిన రూ. 300 కోట్ల పెట్టుబడులు రెండు దఫాలుగా ఉంటాయని ఆ సంస్థ సీఈవో సత్యనారాయణ చావ మంత్రి కేటీఆర్‌కు తెలియజేశారు. 5 బిలియన్ డోసుల కెపాసిటీ కలిగిన ఫార్ములేషన్ ఫెసిలిటీ యూనిట్ కోసం ఈ పెట్

సిద్దిపేట డ్రామాతో దెబ్బతినేదెవరు?

నేటినిజం
బుధవారం 28-10-2020

దుబ్బాక ఉప ఎన్నికకు ముందు జరిగిన పరిణామాలు అధికార టిఆర్ఎస్ పార్టీ దుందుడుకు చర్యలను గుర్తు చేసింది. ఇది పక్కా ప్లాన్ ప్రకారం పోలీసులతో ఆడించిన నాటకంగా ప్రచారం జరుగుతోంది. స్థానిక నేతలు ఆడించిన నాటకం కారణంగా సిఎం కెసిఆర్ ఇమేజ్ దెబ్బతీసేదిగా ఉంది. బిజెపి పరువు తీయాలని యోచించిన వారు తమ పరువు తామే తీసుకున్నారు. అంతేగాకుండా అధినేత పరువును కూడా తీసారు. ఇలాంటి చిల్లర రాజకీయాలకు టిఆర్ఎస్ దూరమని చెప్పలేకపోయారు. ఇలాంటి రాజకీయాలు చేయడం అనవసరమని గుర్తించలేక పోయారు. ఉప ఎన్నికలో తమదే విజయమని భావించిన వారు ఎందుకు ఇలాంటి డ్రామాలు ఆడిస్తున్నారన్నది చెప్పాలి. ప్రజలు అసహ్యించుకునే పరిస్థితులు కల్పించుకుంటున్నారు. టీఆర్ఎస్ ఓడి పోతుందనే విషయం తెలిసి సీఎం కేసీఆర్ పోలీసులను వాడుకుంటున్నారని ఆరోపణలు చేసే స్థాయికి పరిస్థితులను తీసుకుని వచ్చారు. దుబ్బాకలో ఎన్నిక జరుగుతంటే సిద్దిపేటలో డ్రామా నడిపించడం ద్వారా టిఆర్ఎస్ చిల్లర రాజకీయాలు తెరతీసిందన్న భావన ప్రజల్లో కలగచేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఇలాంటి సినిమా నడపడం మంచిది కాదని గుర్తించలేక పోయారు. వరుసపెటట్ఇ అందరి నేతల ఇళ్లపై దాడులు చేసి ఉంటే ఎవరికీ అనుమానాలు వచ్చేవి కావు. ఎన్నికల్లో గెలుపోటములు సహజం. గెలిస్తే విజయంగాను.. ఓడితే ఆత్మస్థయిర్యం పెంచుకునే ఛాన్స్‌గా చూడాలి. కానీ అధికార పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో చేస్తున్న పనులు పార్టీకున్న ఇమేజ్‌ను దెబ్బతీసుకునేవిగా చేశారు. బిజెపిని దోషిగా నిలబెట్టాలన్న తాపత్రయమే తప్పు. తాజాగా విడుదలైన వీడియోల్లో పోలీసులు డబ్బు సంచులు పట్టుకుని వచ్చి అడ్డంగా దొరికి పోయినట్లు వైరల్ అవుతోంది. దీనిని ఎవరూ కాదనలేరు. ఈ వీడియోను ఎవరూ సృష్టించలేదు. పోలీసులు బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు మామ ఇంట్లో సోదాలు చేయటాన్ని పనిగట్టు కుని చేసిన పనిగా ప్రజలు భావిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా బిజెపికి విమర్శలు చేసే అవకాశం ఇచ్చారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రాన్ని పోలీస్ రాజ్యంగా మార్చారని, ప్రజలపై దాడులు, హింస పెరిగిందని వారు అంటున్నారు. పోలీసులను నిజాం ఎలా ఉపయోగించుకున్నడో..సీఎం కేసీఆర్ కూడా అట్లనే వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన చేస్తున్న సీఎం కేసీఆర్ కు గుణపాఠం చెప్పాలని దుబ్బాక ఓటర్లు ఎదరుచూస్తున్నారని అంటూ తాజా పరిణామాలపై బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ తదితరులు ప్రచారం చేసుకుంటున్నారు. ఇది టిఆర్ఎస్ చేసుకున్న స్వయంకృతం తప్ప మరోటి కాదు. ఇప్పుడు దుబ్బాక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావును అరెస్టు చేయించినా.. డబ్బుల పేరుతో డ్రామాలు ఆడినా అది బిజెపికి మాత్రమే కలసి వచ్చే అంశం. డబ్బులు పంచి ఎలాగైనా గెలవాలని టీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నదని ఇప్పటికే బిజెపి నేతలు మండిపడు తున్నారు. దుబ్బాక ప్రజలు టీఆర్ఎస్‌ను ఓడించాలని డిసైడ్ అయ్యారన్న ప్రచారం ఉధృతం చేశారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ కొత్త రాజకీయ నాటకాలకు తెరతీశారని టిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు నమ్మశక్యంగా లేవు. ఆయనపై నమ్మకం లేక గ్రామాల బీజేపీ కమిటీలకు కమిటీలే టీఆర్ఎస్‌లో చేరుతున్నా యని అంటున్న మంత్రి హరీష్ రావు ఇలాంటి వ్యవహారాల్లో తలదూర్చడం సరైనది కాదు. నిజంగానే రఘునందన్ రావుతో హరీష్ రావుకు వ్యక్తిగతంగా ఉద్యమ సమయం నుంచే విభేదాలు ఉన్నాయి. రఘునందన్ రావు టిఆర్ఎస్ వీడి వెళ్లడానికి హరీష్ రావు కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ దశలో ఇప్పుడు జరిగిన వ్యవహారాలు సహజంగానే మంత్రికి చుట్టుకోవడం కూడా సమజ పరిణమాంగానే చూడాలి. దొంగ రాజకీయాలు చేస్తున్న రఘునందన్ డిపాజిట్ దక్కించుకునే ప్రయత్నంలో ఉన్నారని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆ ట్రాప్‌లో పడిపోయారని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఆరోపిస్తున్నారు. నిజానికి బిజెపి అభ్యర్థి రఘునందన్ బంధువు ఇంట్లో డబ్బులు పట్టుబడితే అవి ఎలా పట్టుబడ్డాయో చెప్పగలగాలి. కానీ వీడియోలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. పోలీసులు చెబుతున్న కథనాలు నమ్మశక్యంగా లేవు. అవి ఎన్నికల ఖర్చు కోసమే తెచ్చినట్లు పోలీస్ కమిషనర్ చెప్పడం కూడా అనుమానాలకు తావిస్తోంది. అధికారంలో ఉన్న పార్టీ..అదీ సిద్దిపేటలో ఘటన జరగడం నూటికి నూరుపాళ్లు అనుమానాలు కలిగిస్తున్నాయి. సామాన్యులకే పక్కాగా అనుమానాలు వస్తున్నాయి. దీనిపై వీడియో ఫుటేజీలు బయటపెడితే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయంటున్న వారు..ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వైరల్‌గా మారిన ఫుటేజ్‌కు సమాధానం చెప్పాలి. ఇప్పటిదాకా గోబెల్స్ ప్రచారాలతో ప్రజలకు మాయ మాటలు చెప్పాలనుకున్న వారు సమాధానం చెప్పాలి. రాజకీయ సానుభూతి కోసం బిజెపి నాటకాలు ఆడుతున్నారని అంటున్న టీఆర్ఎస్ నాయకుల ఇళ్లలోనూ తనిఖీలు జరిగాయా అన్న దానికి సమాధానం చెప్పాలి. బీజేపీ నేతలు ఓడిపోతున్నామనే అసహనంలో డబ్బును నమ్ముకున్నారని, అందుకే పంచడానికి తీసుకువచ్చి దొరికిపోయారని అంటున్న హరీశ్ దానిని నిరూపించగలిగే స్థాయిలో ఉన్నారా అన్నది ఆలోచన చేయాలి. దుబ్బాక గెలుపును భుజానపై వేసుకున్న హరీష్ రావు నిజంగానే అసహనంలో ఉన్నారని తాజా డ్రామాను చూస్తే అర్థం అవుతుంది. అధినేతను మచ్చిక చేసుకోవడం కోసం ఎన్ని ఆరోపణలు అయినా చేయవచ్చు. గెలవడానికి కావలసిన ఎత్తులు వేయవచ్చు. కానీ అవి అభాసుపాలు కాకుండా చూసుకోవాలి. అధినేతకు మచ్చరాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. దుబ్బాక ఎన్నికల్లో పంచడానికి ఉన్న డబ్బు సిద్దిపేటలో ఉంటే రాష్ట్రమంతటా సోదాలు చేయాలి. టిఆర్ఎస్ నేతలు ఇళ్లూ సోదాలు చేయాలి. పోలీసులు కూడా పక్షపాతంగా వ్యవహరించడం సరికాదు. వీడియో ఫుటేజీకి సంబంధించి సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా వారిపై ఉంది. రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా పోటీ చేసే అవకాశం అన్ని పార్టీలకు ఉంటుంది. ఒక పార్టీని పట్టుకుని టార్గెట్ చేయాలని చూస్తే ప్రజల్లో ఇమేజ్ దెబ్బతినగలదు.

పేదలను దోచుకునేందుకే ఎల్ఆర్ఎస్

దుబ్బాక ప్రచారంలో మాజీమంత్రి శ్రీధర్ బాబు

సిద్దిపేట,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): పేదలను దోచుకునేందుకే టీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే శ్రీధర్ బాబు విమర్శించారు. ప్రజలెవరూ ఎల్ఆర్ఎస్ రుసుం కట్టవద్దని కోరారు. ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిని ఓడించి కేసీఆర్‌కు కనువిప్పు కలిగించాలని పిలుపునిచ్చారు. ఫాంహౌస్‌లో ఉండే కేసీఆర్‌ను ప్రజాక్షేత్రంలోకి తీసుకువచ్చే అవకాశం దుబ్బాక ప్రజలకు వచ్చిందని వివరించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై నిలదీసేందుకు అసెంబ్లీకి ప్రశ్నించే గొంతుకను పంపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మొక్కజొన్నను కొనుగోలు చేయనని ససేమిరా అన్న సీఎం కేసీఆర్ దుబ్బాక దెబ్బకు దిగివచ్చి గిట్టుబాటు ధరను ప్రకటించారని, ఇది ఈ నియోజకవర్గ ప్రజల విజయమేనని అన్నారు. ఈ ఉపఎన్నికల్లో బీజేపీ, టీఆర్ఎస్‌లను ఓడిస్తేనే ప్రభుత్వాలు దిగివస్తాయని, మద్దతు ధర, పంటనష్టం సాధించుకోగలుగుతామని అన్నారు. పలు గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రైతులు పండించిన పంటకు బీమాలేదని, దీనివల్ల పంట నష్టానికి పరిహారం రాకుండా పోయిందన్నారు. సీఎం కేసీఆర్ చెప్పిన విధంగా సన్నరకం ధాన్యాన్ని పండించినందున దిగుబడి ఎకరాకు 30 నుంచి 20 క్వింటాళ్లకు తగ్గిందని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2500 గిట్టుబాటు ధర చెల్లించాలన్నారు. పంటనష్టం పరిహారం ఎకరాకు రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యతోపాటు ఇచ్చిన హామీలను మెడలు వంచి నెరవేర్చుకోవాలంటే దుబ్బాక ప్రజల తీర్పులోనే ఉందన్నారు.

ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు

-దుబ్బాక ప్రచారంలో జీవన్ రెడ్డి ప్రశ్న

సిద్దిపేట,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దుబ్బాకలో జరుగుతున్న ఉపఎన్నిక తెలంగాణ ఆత్మగౌరవానికి, అధికార దాహానికి మధ్య జరుగుతున్న పోటీ అని మాజీమంత్రి,ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పలుగ్రామాల్లో , కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గొర్రెలు, బర్రెలు ఇవ్వడాన్ని తాము తప్పుపట్టడం లేదని, యువకులకు ఉద్యోగ కల్పనలో మాత్రం ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇంజనీరింగ్, పీజీలు చదవిన యువకులు గొర్రెలు, బర్రెలు కాయాలా? ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎంత మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ కుటుంబంలో మాత్రం నలుగురికి ఉద్యోగాలు లభించాయని ఎద్దేవా చేశారు. ఉద్యోగాలు కల్పించకపోగా కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడంలేదని ఆరోపించారు. అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

నేడు భద్రాద్రి జిల్లాలో పువ్వాడ పర్యటన

భద్రాద్రి కొత్తగూడెం,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం 7:30కు ఖమ్మంలో ప్రారంభమై 10:30కు కరకగూడెం మండలాన్ని చేరుకుంటారు. అక్కడ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గొల్లగూడెం రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, 11 గంటలకు మణుగూరు మండలంలో రామానుజవరం నుంచి పగిడేరు వరకు రహదారి నిర్మాణ పనలకు శంకుస్థాపన, 11:30 గంటలకు మణుగూరులో కునుకుగు గుంపు వద్ద లోవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆదర్శనగర్‌లో శంకుస్థాపన, 12:15 గంటలకు అశ్వారావుపేట నుంచి అమ్మగారిపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, మధ్యాహ్నం 2 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో వరి ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

నిర్మల్‌లో స్మైల్ ఎ గిఫ్ట కింద అందచేసిన అంబులెన్స్‌లను జెండా ఊపి ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి.

అత్యవసర సేవలకు అంబులెన్సులను మూడింటిని సమకూర్చి జెండా ఊపిన మంత్రి

నిర్మల్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సూచించారు

. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా సమకూర్చిన అంబులెన్స్‌ను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. కేటీఆర్ పిలుపు మేరకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తన సొంత నిధులు రూ. 61.50 లక్షలతో 3 అంబులెన్స్‌లను సమకూర్చారు. ఈ వాహనాల్లో ఆక్సిజన్, వెంటిలేటర్‌తోసహా అత్యాధునిక సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కె.విజయలక్ష్మి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంధ్రత్ ఈశ్వర్, టీఆర్ఎస్ యువజన నాయకులు అల్లోల గౌతమ్ రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ దేవేందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టిఆర్ఎస్ అడ్డదారులు

కెసిఆర్ నియంతృత్వ పాలన సాగిస్తున్నారు
సిద్దిపేట ఘటనపై మండిపడ్డ బండి సంజయ్
-కరీంనగర్‌లో బండికి మద్దతుగా ఆందోళన

కరీంనగర్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఎన్నికల్లో ఓటమి భయంతోనే తెలంగాణ ప్రభుత్వం అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగరలోని ఎంపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ రాచరిక, నియంతృత్వ పాలన కొనసాగిస్తు న్నారని, ఇందుకు సిద్దిపేట సంఘటనే నిదర్శనమన్నారు. ఫాంహౌస్‌కు పరిమితమైన సీఎం కేసీఆర్ ఆదేశాలతోనే పోలీసులు అరాచకం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం లాగానే మంత్రులు సైతం బరితెగించి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. దుబ్బాక ఎన్నికల్లో గెలిచేందుకు కార్యకర్త కారులో డబ్బుపెట్టి రికవరీ అంటూ రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారని, సిద్దిపేటలో బీజేపీ అభ్యర్థి ఇంట్లో తనిఖీలకు వెళ్లిన పోలీసులు మహిళలు, చిన్నపిల్లల పట్ల సంస్కారహీనంగా వ్యవహరించారని ఆరోపించారు. దుబ్బాక ఎన్నికలకు సిద్దిపేటకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. సిద్దిపేటకు వెళ్తున్న తన కారును అడ్డగించి అరెస్ట్ చేసే సమయంలో గొంతు పట్టి కారులో పడేశారని తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని తాము కోరుకుంటే.. ప్రభుత్వం మాత్రం శాంతిభద్రతల సమస్య సృష్టించాలని చూస్తోందని పేర్కొన్నారు. సిద్దిపేట సీపీని సస్పెండ్ చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎలక్షన్ కమిషన్ ఉందో లేదో కూడా తెలియడం లేదన్నారు. ప్రజాస్వామ్యబద్ధం గా ఎన్నికలు నిర్వహించకుంటే ఫాంహౌస్, ప్రగతిభవన్‌పై సైతం దాడి చేస్తామని హెచ్చరించారు. సీపీని సస్పెండ్ చేయాలనే డిమాండ్‌తో ఎంపీ కార్యాలయంలోనే సంజయ్ నిరాహారదీక్షకు దిగారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు. దుబ్బాక ఉప ఎన్నిక నేపథ్యంలో సిద్దిపేటలో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన సోమవారం రాత్రి దీక్ష చేపట్టారు. ఎంపీ కార్యాలయంలోనే దీక్షకు ఉపక్రమించిన సంజయ్, రాత్రి నేలపై పడుకొని తన నిరసనను తెలిపారు. సంజయ్ దీక్షకు సంఘీభావంగా బయట కార్యకర్తలు బైఠాయించి ఆందోళన కొనసాగించారు. పోలీసుల వ్యవహార శైలి గురించి బండి సంజయ్ మాట్లాడుతూ.. తాను సిద్దిపేటకు వెళ్తే, సీపీ జోయల్ డేవిస్ తనపై దాడి చేసి అక్రమంగా కరీంనగర్‌కు తరలించారని ఆరోపించారు. సీపీని వెంటనే సస్పెండ్ చేసి క్రిమినల్ చర్యలు చేపట్టే వరకు దీక్ష కొనసాగిస్తానని స్పష్టం చేశారు. దుబ్బాకలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగితే, బీజేపీ గెలుపు తథ్యమని భావించిన అధికార టీఆర్ఎస్ పార్టీ, అధికారులను ఉసిగొలిపి అరాచకాలకు పాల్పడుతుందని విమర్శించారు. ఇక రెచ్చగొట్టే చర్యలకు దిగినా, కార్యకర్తలు సమన్వయం పాటించి దుబ్బాక నియోజకవర్గంలోని బూత్ లెవల్ కార్యకర్తలు యథావిధిగా ప్రచారం కొనసాగించాలని సంజయ్ కోరారు. సిద్దిపేట సంఘటనపై ఎన్నికల సంఘం స్పందించాలని, కేంద్ర బలగాలను పంపించి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కరీంనగర్ ఎంపి, బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్‌పై సిద్దిపేట పోలీసుల దురుసు ప్రవర్తనను నిరసిస్తూ మహబూబాబాద్ పట్టణంలో సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దమనం చేసిన బిజెపి కార్యకర్తలు

దుబ్బాక నిధులు ఎందుకు తరలాయి?

ముత్యం రెడ్డి అభివృద్ధి ఎందుకు ఆగింది
ప్రచారంలో టిఆర్ఎస్‌ను నిలదీస్తున్న చెరుకు శ్రీనివాసరెడ్డి

సిద్దిపేట,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దుబ్బాక నియోజకవర్గానికి వచ్చిన నిధులను తరలించుకుపోయిన మంత్రి హరీశ్‌రావు ఇప్పుడు ఎలా ఓట్లడుగుతున్నారని కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేగా తన తండ్రి తెచ్చిన అభివృద్ధి పనుల్లో ఒక్కటి కూడా పూర్తి చేయలేక పోయారని మండిపడ్డారు.

పనులన్నీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు మిగిలిపోయాయని తెలిపారు. నియోజకవర్గంలో ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి తప్ప దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. ఏడేళ్ల టీఆర్ఎస్ పాలనలో దుబ్బాక నియోజకవర్గంపై హరీశ్‌రావు సవితి తల్లి ప్రేమ చూపించారని.. మళ్లీ ఇప్పుడు అభివృద్ధి చేస్తా అంటే ప్రజలు ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గ పరిస్థితులపై ఏమాత్రం అవగాహనలేని సోలిపేట సుజాతను గెలిపించుకుంటే వచ్చిన నిధులను సిద్దిపేట, గజ్వేల్‌కు తరలించవచ్చని హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. పలు గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి వచ్చిన నిధులన్నీ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటకు తరలించుకుపోయారని ఆరోపించారు. హరీశ్‌రావు వచ్చి అభివృద్ధి చేస్తానంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. టీఆర్ఎస్ గెలిస్తే అభివృద్ధిలో దుబ్బాక మరో పదేళ్లు వెనక్కి పోతుందని ఆయన జోస్యం చెప్పారు. ఇదిలావుంటే చెరుకు ముత్యం రెడ్డి భార్య కూడా ప్రచారంలో దూసుకుని పోతోంది. దుబ్బాక ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున పోటీచేస్తున్న చెరుకు శ్రీనివాసరెడ్డిని ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని చెరుకు విజయలక్ష్మి ఓటర్లను అభ్యరించారు. ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.దుబ్బాక నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది దివంగత ముత్యంరెడ్డి హయాంలోనే అని ఆమె గుర్తుచేశారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గాన్ని అన్నింటిలో ముందంజలో నిలిపేందుకు ఆయన వారసుడు ముందుకొచ్చాడన్నారు. ఒక్కసారి అవకాశం ఇచ్చి అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు.

'ప్రభుత్వ పాలనలో ప్రణాళికా శాఖ పాత్ర కీలకం'

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రణాళికా శాఖ పాత్ర కీలకమని ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం గణాంక భవన్‌లో తెలంగాణ స్టాటిస్టికల్ అబ్‌స్టాట్స్ పుస్తకాన్ని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి కే. రామకృష్ణారావుతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జీఎస్డీపీ అంచనాలు, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, పలు సర్వేల గణాంకాలు, ప్రభుత్వం సాధించిన ప్రగతి తదితర వివరాలు ఈ పుస్తకంలో పొందుపర్చామని తెలిపారు. రాష్ట్ర సమగ్ర కార్యాచరణ సమాచారాన్ని క్రోడీకరించి పుస్తక రూపంలో తీసుకురావడం గొప్ప విషయమన్నారు. సమాచారం కోసం రబిబూ://బిబటూబ.బ్గి÷జీనిణజీనిజీ.ణనీల.తిని వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు విధిగా ఈ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవాలని, ఆయా సమావేశాల్లో గణాంకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామస్థాయి సమాచారంతో ప్రత్యేకంగా పుస్తకాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రోడ్ అట్లాస్‌పై దృష్టిని సారించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖల ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వశాఖలకు ఉపయోగపడేలా సమగ్ర గణాంకాలతో పుస్తకాన్ని ప్రచురించినట్లు తెలిపారు. త్వరలో గ్రామస్థాయి సమాచారంతో పుస్తకాన్ని తీసుకుని రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డెవలప్‌మెంట్ ఎ÷-లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) సీఈఓ. జి. దయానంద్, రాష్ట్ర రిమోట్ సెన్సింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస్ రెడ్డి, సిజిస్ సంస్థ ప్రతినిధి రాజేంద్ర పాల్గొన్నారు.

సిద్దిపేట ఘటనతో రాజకీయ వేడి

సీరియస్‌గా తీసుకున్న బిజెపి నేతలు

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికకు సమయం దగ్గరపడే కొద్ది రాజకీయంగా వేడి పుట్టిస్తోంది. ఈ ఎన్నికను పార్టీలన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే రణరంగాన్ని తలపిస్తోంది.!. సిద్దిపేట ఘటన తరవాత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అరెస్ట్‌తో ఈ వ్యవహారం మరింత ముదిరింది. ఆయన అరెస్ట్‌కు నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు.

కరీంనగర్‌లో ఎంపీ కార్యాల యం బీజేపీ నేతలు ఎదుట టెంట్లు వేశారు. సంజయ్‌కు మద్దతుగా కార్యకర్తలు, నేతలు దీక్షలో కూర్చున్నారు. బీజేపీ అధికార ప్రతినిధి రాకేష్, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఎంపీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. మరోవైపు.. బండి అరెస్ట్‌కు నిరసనగా ఏబీవీపీ, బీజేవైఎం నాయకులు చలో ప్రగతిభవన్‌కు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రగతి భవన్‌వద్దకు వందల సంఖ్యలో చేరుకుంటున్నారు.ఇదిలా ఉంటే.. రఘునందన్ రావు మామ, బంధువుల ఇంటిపై పోలీసుల దాడి చేసిన వ్యవహారాన్ని బీజేపీ సీరియస్‌గా తీసుకుంది. సంఘటనపై, పోలీసుల తీరుపై ఫిర్యాదు చేసే యోచనలో అభ్యర్థి ఉన్నారు. మరోవైపు.. ఈ మొత్తం వ్యవహారంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసే యోచనలో బీజేపీ నేతలు ఉన్నారు. ఉప ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పరిణామాలపై బీజేపీ కేంద్ర పెద్దలు నిశితంగా పరిశీలిస్తున్నారు. అటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఇటు అభ్యర్థి రఘునందన్ రావుకు ఫోన్ చేసి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరా తీస్తున్నారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగంపై ఆరోపణల నేపథ్యంలో కేంద్ర బలగాలను మోహరించి ఎన్నికలు జరపాలని బీజేపీ నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఇదిలా ఉండగా.. ఎంపీ బండి సంజయ్‌పై పోలీసుల దాడికి నిరసనగా బీజేపీ అనుబంధ విద్యార్థి సంస్థ ఏబీవీపీ, బీజేవైఎం ప్రగతి భవన్ ముట్టడికి నేడు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రగతి భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

సన్నరకాలతో మోసపోయిన రైతులు

-వారిని వెంటనే ఆదుకోవాలి: సీతక్క

వరంగల్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పట్ల అవలంబిస్తున్న విధానాలతో రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ రంగం అట్టుడికి పోతోందని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. నిర్బంధంగా సన్నరకం వరిని సాగు చేయించడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. కొన్నిచోట్ల దోమపోటుతో దెబ్బతిన్న వరికి నిప్పు పెట్టుకున్న ఘటనలు చూస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 40 లక్షల ఎకరాల వరి పంట సాగులో ప్రభుత్వం బలవంతంగా 30 లక్షల వరకు సన్నరకం వడ్లను సాగు చేయించిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా భూసార పరీక్షలు నిర్వహించకుండ నిర్బంధంగా సన్నరకం వరి సాగు చేయించారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ తన ఫాంహౌస్‌లో భూసార పరీక్షలు నిర్వహించి, అక్కడి కలెక్టర్ సూచనల మేరకు దొడ్డు వడ్లు పండించారని అన్నారు. ప్రభుత్వం ద్వంద వైఖరితో ఈ రోజు రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని, ఇప్పటికైన ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి రైతులను ఆదుకునే ప్రయత్నం చేయాలని అన్నారు. రైతుల పక్షాన పోరాటం చేస్తామని, రైతులను ఆదుకుంటామని అన్నారు.

ఆ ఇద్దరిదీ అవినీతి చరిత్రే

-కమల్‌నాథ్,దిగ్విజయ్‌లపై సిందియా ఫైర్

భోపాల్,అక్టోబ

దుబ్బాకలో ఎన్నికయితే సిద్దిపేటలో సోదాలా?

–పోలీసుల తీరుపై మండిపడ్డ బండి సంజయ్

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): రఘునందన్‌రావు బంధువుల ఇళ్లలో పోలీసుల సోదాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఖండించారు. దుబ్బాకలో ఎన్నికలు జరుగుతుంటే సిద్దిపేటలో సోదాలు చేయడమేంటని ప్రశ్నించారు. సోదాలు చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధమన్నారు. తెలంగాణ ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం దుందుడుకు చర్యకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇది కక్షసాధింపు చర్య తప్ప మరోటి కాదన్నారు. దుబ్బాకలో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ప్రజాబలాన్ని ఓర్వలేకనే ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసులతో దాడులు చేయిస్తున్నారని విమర్శించారు బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి. టీఆర్ఎస్ వాళ్లే డబ్బులు పంచుతున్నారని ఆరోపించారు. హుజూర్ నగర్ లో పోలీసులతో డబ్బులు పంచారనిఎంత అడ్డుకుంటే అంత ముందుకు వెళ్తామన్నారు.

లండన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్, అక్టోబర్ 27: లండన్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్(టాక్) ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్ఫూర్తితో బతుకమ్మ వేడుకలను లండన్ టవర్ బ్రిడ్జి వద్ద నిర్వహించినట్లు టాక్ వ్యవస్థాపకులు అనిల్ కుర్మాచలం తెలిపారు.

కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. చారిత్రాత్మక లండన్ టవర్ బ్రిడ్జి వద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహించడం చాలా గర్వంగా ఉందని తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న వారికి అనిల్ కుర్మాచలం కృతజ్ఞతలు చెప్పారు.

స్థానిక కోవిడ్ నిబంధనల వల్ల టాక్ కార్యవర్గ సభ్యులంతా వివిధ గ్రూప్‌లుగా ఆరుగురికి మించకుండా బతుకమ్మ వేడుకల్ని జరుపుకున్నామని, కొంత మంది ఇంటికే పరిమితమై బతుకమ్మ పండగ జరుపుకున్నారని పేర్కొన్నారు. మన సంస్కృతిని మరిచి పోకుండా ఎలాంటి పరిస్థితులున్న ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ ఆడిన ప్రతి ఒక్క ఆడబిడ్డకు అధ్యక్షురాలు పవిత్ర రెడ్డి కంది కృతజ్ఞతాభినందనాలు తెలిపారు.

పారిపోయిన నీరవ్ మోడీకి ఎదురుదెబ్బ

–బెయిల్ పిటిషన్ తిరస్కరించిన లండన్ కోర్టు

న్యూఢిల్లీ,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): పారిపోయిన డైమండ్ వ్యాపారి నీరవ్ మోదీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. నీరవ్ మోదీ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను లండన్ కోర్టు మరోసారి తిరస్కరించింది. ఈ నెల ప్రారంభంలో యూకే కోర్టు నవంబర్ 3 న కొనసాగుతున్న అప్పగించే విచారణలో తదుపరి షెడ్యూల్ విచారణ వరకు మోదీ రిమాండ్‌ను పొడిగించింది. గత నెలలో మోదీ న్యాయవాది లండన్ కోర్టుకు హాజరై.. నీరవ్ మోదీకి భారతదేశంలో న్యాయమైన విచారణ జరిగే అవకాశం లేదని చెప్పారు. తన కేసును రాజకీయం చేయడం, భారతీయ జైళ్లలో తగిన వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల అతను ఆత్మహత్యకు పాల్పడే ప్రమాదం అధికంగా ఉన్నదని స్పష్టం చేశారు. 2 బిలియన్ డాలర్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో మోసం, మనీలాండరింగ్ అభియోగాలపై అప్పగించాలని భారత్ పోరాడుతుండగా.. పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ బెయిల్ పిటిషన్‌ను యూకే కోర్టు ఐదవసారి తిరస్కరించింది. 49 ఏండ్ల వయసున్న నీరవ్ మోదీ.. వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ వద్ద వీడియోలింక్ ద్వారా నిర్వహించిన కాల్–ఓవర్ విచారణ సందర్భంగా రిమాండ్‌కు తరలించారు. భారత ప్రభుత్వం తెచ్చిన ఆరోపణలపై స్కాట్లాండ్ యార్డ్ జారీచేసిన వారెంటుపై 2019 మార్చి 19 న నీరవ్ మోదీని అరెస్టు చేశారు. అప్పటి నుంచి నైరుతి లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలులో ఉంటున్నాడు.

15 లక్షలు డిమాండ్ చేసిన కిడ్నాపర్

–అధియాన్ హత్యపై వెలుగు చూసిన నిజాలు

మేడ్చల్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): శామీర్‌పేట్ పరిధిలో బాలుడి హత్యలో అనేక విషయాలు బయటపడుతున్నాయి. ఈ కేసులో పోలీసులకు కీలక ఆధారాలు లభించాయి. బాలుడి తండ్రికి నిందుతుడు ఫోన్ చేసి రూ. 15 లక్షలు డిమాండ్ చేశారు. అంతేకాదు డబ్బులు తీసుకురాకపోతే బాలుడిని చంపేస్తానని బెదిరించారు. ఇప్పుడు ఈ ఫోన్ కాల్ ఆడియో వైరల్ అయింది. కాగా శామీర్‌పేటకు చెందిన సయ్యద్ యూసఫ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యూసఫ్, గౌసియాలకు ఒక కూతురు, ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కొడుకు అధియాన్ (5) ఈ నెల 15న ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. దీంతో పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు మైనర్‌గా గుర్తించారు. యితే ఈ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. షేర్‌చాట్ వీడియోలు చేస్తుండగా ప్రమాదవశాత్తు బాలుడు అధియాన్ కింద పడ్డాడు. దీంతో భయాందోళనతో బాలుడిని నిందితుడు గొంతునులిమి చంపారు. ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన అటవీప్రాంతంలో నిందితుడు మృతదేహాన్ని పడేశాడు. అయితే మహబూబాబాద్ దీక్షిత్ హత్య కేసు సమాచారాన్ని నిందితులు తెలుసుకున్నాడు. హత్య తర్వాత కూడా కిడ్నాపర్ డబ్బులు డిమాండ్ చేసినట్లు విని.. బాలుడి తండ్రికి ఫోన్ కాల్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు. వచ్చిన డబ్బుతో బిజినెస్ చేసి సెటిల్ అవ్వాలని నిందితుడు ప్లాన్ చేశాడు.

తెలంగాణలో తగ్గుతున్న కరోనా కేసులు

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా కేసులు భారీగా తగ్గుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 14,729 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 582 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 2,31,834కి చేరింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ సోమవారం ఉదయం బులిటెన్ విడుదల చేసింది. ఇక గడిచిన 24 గంటల్లో కరోనాతో నలుగురు మృతి చెందడంతో మరణాల సంఖ్య 1,432కి చేరింది. నిన్న ఒక్క రోజే 1,432 మంది కోలుకున్నారు. దీంతో ఇప్పటివరకు కరోనా నుంచి కోలుకున్న బాధితుల సంఖ్య 2,11,912కి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 18,611 యాక్టివ్ కేసులు ఉన్నాయని, వారిలో 15,581 మంది హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. తెలంగాణలో ఇప్పటి వరకు నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్య 40,94,417కి చేరింది.

కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ

గద్వాల,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గద్వాల్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని కోటి రూపాయల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. నోట్లను పువ్వుల్లా తయారుచేసి అమ్మవారిని వాటితో అద్భుతంగా అలంకరించారు. కరోనా వైరస్ కారణంగా ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిన వేళ ఇలా కోటి రూపాయలతో అమ్మవారిని దుర్గాదేవిలా అలంకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అలంకరణ కోసం వివిధ రంగుల్లో ఉన్న నోట్లను ఎంచుకున్నారు. ఆ నోట్ల మొత్తం విలువ రూ. 1,11,11,111. గతేడాది అమ్మవారిని రూ.3,33,33,333 విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించినట్లు ఆలయ కోశాధికారి పి.రాము తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం కారణంగా గతేడాదితో పోలిస్తే ఈసారి ఆ మొత్తం తగ్గిందని పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీకి చెందిన 40–50 మంది భక్తులు ఇచ్చిన నోట్లతో వీటిని అలంకరించామని, పూజల అనంతరం వాటిని తిరిగి వారికి అప్పగిస్తామని వివరించారు.

దుబ్బాకలో వేడెక్కుతున్న రాజకీయం

పోటీపోటీగా కాంగ్రెస్, బిజెపి నేతల ప్రచారం

గెలుపు లక్ష్యంగా ఇరు పార్టీల నేతల మొహరింపు

సిద్దిపేట,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నిక సమయం దగ్గరపడుతుండటంతో రాజకీయ వేడి పెరుగుతోంది. అధికార టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. దుబ్బాక ఉప ఎన్నికలో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ అష్టకష్టాలు పడుతోంది. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా.. దుబ్బాకలో గెలుపు కాంగ్రెస్ పార్టీకి తప్పనిసరి అయింది. ఇక్కడ టీఆర్ఎస్ విజయం సాధిస్తే ఇన్నాళ్ల ప్రభుత్వంపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు చెక్ పడనుంది. తమ పార్టీ గెలిస్తే త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని కాంగ్రెస్,బిజెపి పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ విజయం క్యాడర్‌కు, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచడంతో పాటు ఉత్సాహాన్ని నింపుతుందనుకుంటున్నారు. ఒకవేళ దుబ్బాకలో బీజేపీ విజయం కైవసం చేసుకుంటే అధికార పార్టీకి ప్రమాద ఘంటికలు మోగడంతో పాటు.. రాష్ట్రంలో టిఆర్ఎస్ పని అయిపోయిందన్న ప్రచారం చేస్తుంది. అలాగే కాంగ్రెస్ పని అయిపోయిందని ప్రచారం చేసే అవకాశం ఉంది. ఈ తరుణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డాలని రాష్ట్ర నాయత్వం పనిచేస్తోంది. అలాగే బిజెపి కూడా అదే పనిలో ఉంది. అందుకే బిజెపి, కాంగ్రెస్ పార్టీలు తమ నాయకులను గడిచిన నెలంరోజులుగా గ్రామాల్లో మొహరించి ప్రచారంలో దూకుడు పెంచాయి. పార్టీల ముఖ్య నేతలు ప్రతి ఓటరును కలిసి తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రచారాన్ని గ్రామస్థాయికి, బూత్ స్థాయికి తీసుకెళుతున్నారు. కాంగ్రెస్ తరఫున పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి,పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్ అలీ, శ్రీధర్ బాబులు పని చేస్తున్నారు. వారందిరికీ ఒక్కో పోలింగ్ బూత్ బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. అక్కడ ఓట్లు తక్కువ వస్తే ఆ నాయకుడే బాధ్యతవహించాల్సి ఉంటుందని హెచ్చరించారని కూడా సమాచారం. అలాగే బిజెపి నేతలు బండి సంజయ్, వివేక్, ధర్మపురి అర్వింద్, డికె అరుణ, జితేందర్ రెడ్డి, మోత్కుపల్లి తదితరులు కూడా ఊరూవాడా చుట్టివచ్చి ప్రచారం చేస్తున్నారు. ఇలా నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక నాయకుడిని నియమించారు. తమ పరిధిలో సరైన ఓట్లు రాకపోతే ఎక్కడ పరువుపోతుందోనని తామే ఎన్నికల బరిలో దిగినట్లుగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర అగ్రనాయకులు, ప్రజాకర్షణ ఉన్న నేతలు దుబ్బాక నియోజకవర్గంలోని ఊరూరు చుట్టేస్తున్నారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్, భట్టి, వీహెచ్, దామోదర రాజనరసింహా లాంటి నేతలంతా టీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు గుప్పిస్తూ ప్రచారంలో దూసుకెళుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యం శ్రీనివాసరెడ్డి తండ్రి ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి తమకు ప్లస్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ముత్యంరెడ్డి దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడేవారని రాజకీయపార్టీలకతీతంగా అందరూ అంగీకరిస్తారు. గతంలో కేసీఆర్, ముత్యంరెడ్డి మంత్రులుగా పనిచేసిన సమయంలో సిద్దిపేటలో కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి పోటీగా దుబ్బాకలో పనులు చేపట్టేవారని చెబుతారు. నిధుల విషయంలోనూ, అభివృద్ధి పనుల విషయంలోనూ ఇద్దరి మధ్య పోటీ ఉండేదంటారు. అయితే టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గజ్వేల్, సిద్దిపేట స్థాయిలో దుబ్బాకను అభివృద్ధి చేయలేదనే ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్తున్నారు. ముత్యంరెడ్డి పట్ల నియోజకవర్గంలో సానుకూలత.. ఆయన చనిపోయాక సానుభూతి కలిసొస్తుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. బిజెపి మాత్రం ఇందుకు భిన్నంగా కాంగ్రెస్, బిజెపిలను టార్గెట్ చేస్తూ కేంద్రం నిధులను ప్రస్తావిస్తున్నారు. గడీల పాలనను తరిమి కొట్టాలని పిలుపునిస్తున్నారు. మొత్తంగా రాజకీయ వేడి పుట్టి ప్రజలు తాము ఎటు వైపో చెప్పడం లేదు.

తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదు : హరీష్ రావు

సిద్దిపేట, అక్టోబర్ 27: భారతీయ జనతా పార్టీ తెలంగాణకు చేసిందేమీ లేదు అని మంత్రి హరీష్ రావు అన్నారు. రైతులను కష్టాల్లోకి నెడుతుందన్నారు. వ్యవసాయ పంపు సెట్ల వద్ద మీటర్లు తెచ్చిపెట్టి.. రైతులకు ఇబ్బందులు సృష్టిస్తుందని మంత్రి తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలోని తొగుటలో టీఆర్ఎస్ యువ గర్జన ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ప్రసంగించారు.కాంగ్రెస్, బీజేపీ పార్టీలవి వాపు మాత్రమే.. నిజమైన బలం టీఆర్ఎస్ పార్టీదే అని హరీష్ రావు తెలిపారు. సాధ్యం కాదనుకున్న తెలంగాణను టీఆర్ఎస్ పార్టీ సాధించింది. రాష్ట్ర ప్రకటనను వెనక్కి తీసుకుంటే ఎమ్మెల్యేలందరూ రాజీనామా చేశారు. రాజీనామా చేయకుండా కిషన్ రెడ్డి పారిపోయారు. తెలంగాణ తెచ్చింది తాము అని ఈరోజు బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. 70 ఏళ్లలో కాంగ్రెస్, టీడీపీలు చేయని పనులను టీఆర్ఎస్ పార్టీ చేసి చూపించిందని తెలిపారు. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెప్పారు. మనకు రావాల్సిన నిధులు, నీళ్లను తెచ్చుకున్నామని పేర్కొన్నారు.బీజేపీ నల్లధనం హామీ ఏమైంది? అని ప్రశ్నించారు. దేశంలోని ప్రతి పౌరుడి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని చెప్పారు. దేశంలో ఎవరి ఖాతాలోనైనా రూ. 15 లక్షలు వేశారా? అని అడిగారు. మోదీ ప్రభుత్వం అధికారం లోకి వస్తే సంవత్సరానికి కోటి ఉద్యోగాల న్నారు. ఆరేళ్లలో ఆరు కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి కదా? మరి ఏమైందని ప్రశ్నించా రు. నిజామాబాద్‌లో అర్వింద్ కుమార్ తాను గెలిస్తే... పసుపు బోర్డు తెస్తా అని బాండ్ పేపర్ మీద రాసిచ్చాడు. వచ్చిందా పసుపు బోర్డు అని అడిగారు. ముత్యం రెడ్డి మంచి నాయకుడని కాంగ్రెస్ మొసలి కన్నీరుకారుస్తోంది. అదే నిజమయితే కాంగ్రెస్ పార్టీ 2018లో టికెట్ ఎందుకు ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు.

ఒక్కో రైతు ఖాతాలో 2వేలు జమ

రైతు భరోసా కింది జమకు ఆదేశాలు

చంద్రబాబు తీరుపై మండిపడ్డ మంత్రి కన్నబాబు

అమరావతి,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): మంగళవారం ఒక్కో రైతు అకౌంట్‌లో రూ.2వేలు జమచేస్తామని ఎపి వ్యవసాయ శాఖమంత్రి కన్నబాబు ప్రకటించారు. రెండో విడత రైతు భరోసా–పీఎం కిసాన్ కింద రైతుల అకౌంట్లలో నగదు జమ చేస్తామని తెలిపారు. కొత్తగా పట్టాలిచ్చిన గిరిజన రైతులకు కూడా రూ.2 వేలు జమ చేస్తామని పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కాపురం హైదరాబా ద్‌లో. .పెత్తనం ఏపీలో చేస్తారని ఎద్దేవాచేశారు. 16న వర్షాలు పడితే 26న మాజీమంత్రి లోకేష్ వెళ్లి ఏం చేస్తారు? అని కన్నబాబు ప్రశ్నించారు. వరద రాజకీయం, బురద రాజకీయం ఎంతకాలం చేస్తారని నిలదీశారు. కమ్యూనిస్టు నేతలు వాళ్ళ జెండాలు వదిలి టీడీపీ ఎజెండా మోస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు బీజేపీ వెంట పడుతుంటే మీరు చంద్రబాబు వెనుక పడుతున్నారని విమర్శించారు. ఈ రాజకీయం ఏంటో అర్థం కావటం లేదన్నారు. చంద్రబాబును కౌగిలించుకున్నవారు బతికి బయట పడినవారు లేరని తెలిపారు. కేంద్రం కట్టాల్సిన పోలవరాన్ని కమీషన్లకి కక్కుర్తి పడి తామే కడతామని లాక్కున్నారని కన్నబాబు గుర్తుచేశారు.

ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బ తిన్న వ్యవసాయ పంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ. 113.11 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని సోమవారం విడుదల చేసింది. జూన్–సెప్టెంబర్ మధ్య కాలంలో సంభవించిన వరదలు, భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులు చేయనుంది. గోదావరి, కృష్ణా, కుందూ నదుల వరదల ప్రభావంతో 33 శాతానికంటే ఎక్కువగా దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ అందనుంది. కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు భారీ ఎత్తున ఆస్తి, పంట నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే.

విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కడప, అనంత జిల్లాల్లోని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయగా.. నేరుగా రైతుల ఖాతాల్లోకి ఈ సబ్సిడీ చెల్లింపులు జరపాలని వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు అధికారులను ఆదేశించారు. అదే విధంగా వర్షాలకు దెబ్బ తిన్న ఉద్యాన పంటలకు రూ. 22.59 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారు. మే నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో సంభవించిన వరదలు, భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ఉద్యాన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులు చేయనున్నారు. నేరుగా రైతుల ఖాతాల్లోకి చెల్లించాలని మంత్రి తెలిపారు.

మళ్లీ మొదటికి వచ్చిన పోలవరం వ్యవహారం

రాజకీయ పార్టీల్లో అనైక్యతతో ఆడ్డుకుంటున్న కేంద్రం

అమరావతి,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): పోలవరం వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. విభజన చట్టంలో భాగంగా పోలవరం, ప్రత్యేక హోదా విభజన నేపథ్యంలో పార్లమెంటులో ప్రధాని హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక హామీలపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గతంలో చంద్రబాబు, ఇప్పుడు జగన్ కేంద్రాన్ని నిలదీయలేని స్థితిలో ఉన్నారు. ఈ రెండు అంశాలపై విశ్వసనీయమైన పోరాటం చేయకుండా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలను రాజకీయంగా టార్గెట్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ వ్యవస్థలో ఈ బలహీనతను కేంద్రం ఉపయోగించుకుని రాజకీయంగా ఆడుకుంటోంది. ప్రత్యేక హోదాపై మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడానికి టిడిపి, వైకాపాలు పరస్పరం పోటీ పడ్డాయి. ఇప్పుడు పోలవరంపై కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏకం కాకుండా పరస్పరం కలహించుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న బీజేపీని కార్నర్ చేసే బదులు వైయస్సార్ కాంగ్రెస్, టిడిపిలు పరస్పరం తలపడాలని తహతహలాడుతున్నాయి. విభజన సమయంలో సీమాంధ్ర ప్రజలకు ఇచ్చిన హామీలు పోలవరం, ప్రత్యేక కేటగిరీ హోదా అన్న విషయంలో రాజకీయ పార్టీలు గుర్తించడం లేదు. ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా విభజన చట్టం అమలు చేయడం ఈ కీలకమైన వాగ్దానాలకు సంబంధించినది. వాగ్దానాలను రద్దు చేయడం పూర్తిగా ఆమోద యోగ్యం కాదు. ప్రత్యేక హోదా అంశంపై ఇప్పటికే కేంద్రం మోసం చేసిందని అంటున్నా, కలసికట్టుగా పోరాడాలన్న స్పృహ రాజకీయ పార్టీల్లో కానరావడం లేదు. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి మాత్రమే నిధులు ఇస్తామని కేంద్రం చెబుతోంది. ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసం, పునరావాసం వంటి ఖర్చులకు మాత్రం బాధ్యత వహించదని చెప్పారు. అంతేకాకుండా 2013–14 ధరల స్థాయిని పరిగణనలోకి తీసుకుని 2017–18 ధరలకంటే కేంద్ర ఆర్థిక బాధ్యతకు తగ్గట్లు చర్యలు తీసుకుంటామని కేంద్రం వాదిస్తుంది. దీంతో కేంద్రం ఇచ్చేదానికి, ప్రాజెక్టు పూర్తి చేయడానికి కావాల్సిన నిధుల విషయంలోభారీ వ్యత్యాసం ఉంది. కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల నిధులను సమకూరుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అంచనా ప్రకారం సుమారు రూ.55 వేల కోట్లు కేంద్రం సమకూర్చాల్సి ఉందని అంచనా. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. నిర్మాణం, పునరావాసం, పునరావాసం రద్దు చేయడం సాధ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రాజెక్టు అమలును మాత్రమే చేపట్టింది. 30000 కోట్ల భూసేకరణ, పునరావాసం, పునరావాస వ్యయం పై కేంద్రం నిధులు నిరాకరిస్తే పోలవరం ప్రాజెక్టు పూర్తి కానే లేదు. విభజన వల్ల ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ కు జీవనాధారంగా పరిగణించబడుతుంది. దీని విషయంతో పాటు విభజన సమస్యలపై అన్ని పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉంది.

1న గురుకుల ప్రవేశ పరీక్ష

బెల్లంపల్లి,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): నవంబర్ 1న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, జనరల్ గురుకుల విద్యాలయాల్లో టీజీ సెట్ 5 వ తరగతి ప్రవేశం కోసం తెలంగాణ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించ నున్నట్లు సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో 12 కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహి స్తారని పేర్కొన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు వెబ్‌సైట్ల నుంచి అక్టోబర్ 31 వరకు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కొవి డ్–19 నిబంధనలకు అనుగుణంగా పరీక్ష కేంద్రాల వద్దకు గంట ముందుగా చేరుకోవాలన్నారు.సామాజిక దూరాన్ని పాటించాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు, పరీక్ష ప్యాడ్, బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

దుబ్బాకలో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలి

రఘునందన్రావు బంధువుల ఇళ్లపై దాడులు సరికాదు

–బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉపఎన్నికలో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని బీజేపీ నాయకురాలు డీకే అరుణ కోరారు. దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు బంధువుల ఇళ్ళలో సోదాలను ఖండిస్తున్నామని ప్రకటించారు. వేల కోట్లున్న టీఆర్ఎస్ నేతలను వదిలి.. బీజేపీ నేతల ఇళ్లపై పడటం సిగ్గుచేటన్నారు. దుబ్బాకలో టీఆర్ఎస్ గెలుపు బాధ్యతలను పోలీసులకు అప్పగించారా? అని అరుణ ప్రశ్నించారు. పోలీసులు పోస్టింగుల కోసం టీఆర్ఎస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సర్వేలు టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా రావడాన్ని మంత్రి హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. టీఆర్ఎస్‌ను ఓడించి దుబ్బాక ప్రజలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలవనున్నారని డీకే అరుణ కొనియాడారు. దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఇళ్లలో, కార్యాలయాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. సిద్దిపేటలో రఘునందన్‌రావు అత్తారిల్లు, బంధువుల ఇళ్లలో సోదాలు జరిపారు. మొత్తం 8 చోట్ల ఏకకాలంలో తనిఖీలు చేశారు. సిద్దిపేటలో దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు బంధువు ఇంట్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు సోమవారం మధ్యాహ్నం తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా ఆ ఇంట్లో ఉన్న రూ. 18.67 లక్షలను పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాలు జరిపిన బంధువు ఇంటికి రఘునందన్ రావు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దుబ్బాక ఉప ఎన్నికకు నవంబర్ 3న పోలింగ్ జరగనుంది. 10వ తేదీన ఓట్లను లెక్కించనున్నారు.

వరదబాధితులకు టీఆర్ఎస్ ఎన్నారై సాయం

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లోని వరద బాధితులకు టీఆర్ఎస్ ఎన్నారై యూకే బృందం నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. వరద బాధితులకు సాయం చేయాలనే సంకల్పంతో 'వీ – కేర్ మేమున్నాము' అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు టీఆర్ఎస్ ఎన్నారై యూకే అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి తెలిపారు. నిత్యావసర సరుకులతో పాటు జ్వరం, జలుబు, ఇతర నొప్పులకు ఉపయోగపడే మందులను డాక్టర్ సలహా మేరకు ఉచితంగా పంపిణి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతగా సుమారు 300లకు పైగా

అనిమేషన్ కళ విజ్ఞాన వినోదాల నెలవు

(28 అక్టోబర్ 'అంతర్జాతీయ అనిమేషన్ దినం' సందర్భంగా)

మనకు సుపరిచితమైన స్పైడర్ మాన్, మిక్కీ మౌస్, డొనాల్డ్ డక్, టామ్ అండ్ జెర్రీ, అవతార్ సినిమా, కార్టూన్ కళ లాంటి పాత్రలు మన మనసుల్లో సుస్థిరంగా నాటుకున్నాయి. షార్ట్ వాణిజ్య ప్రకటనలతో మె?దలు పూర్తి నిడివిగల చలన చిత్రాల వరకు అనిమేషన్ కళను సృజన జోడించి వినియోగించే స్థాయికి టెక్నాలజీ చేరడం సంతోషదాయకం. సమాజ శ్రేయస్సు కోరే పలు అంశాలను అనిమేషన్ కళలో ప్రత్యేకతలుగా సరళంగా, స్పష్టంగా, అర్థవంతంగా మరియు ఆకర్షణీయంగా తక్కువ సమయంలో వ్యక్తం చేయడాన్ని చెప్పవచ్చు. 28 అక్టోబర్ 1892లో మె?దటి సారి పారిస్‌లో అనిమేషన్ చిత్రం ప్రదర్శించడం జరిగింది. దీనికి గుర్తుగా అనిమేషన్ కళకు పెరిగిన అపార ఆదరణను దృష్టిలో ఉంచుకొని వాణిజ్యరంగం మరియు చలనచిత్రాలలో దాని ప్రాముఖ్యతను వివరించే సదుద్దేశ్యంతో ఇంటర్నేషనల్ అనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్ నేతృత్వంలో 2002 నుండి ప్రతియేటా 28 అక్టోబర్ రోజున 'అంతర్జాతీయ అనిమేషన్ దినం' పాటించుట జరుగుచున్నది. అనిమేషన్ కళకు సృజనను జోడించి నూతనత్వాన్ని ఆపాదించడం, అనిమేషన్ కళ వైపుకు యువతను ఆకర్షించడం, అనిమేషన్‌లో వినూత్న భావాలను జోడించడం, అనిమేషన్ ఆర్ట్ గూర్చి కార్యశాలలు నిర్వహించడం, ప్రఖ్యాత అనిమేషన్ ఫిలిమ్‌లను ప్రదర్శించడం, అనిమేషన్ కళ వెనుక దాగిన వైజ్ఞానికశాస్త్రాన్ని వివరించడం, అనిమేషన్ కళలో నిష్ణాతులను సన్మానించడం లాంటి అంశాలను చర్చించేందుకు అంతర్జాతీయ అనిమేషన్ దిన వేదికలను వినియోగించుకుంటారు.

ప్రపంచవ్యాప్తంగా అనిమేషన్ ప్రక్రియకు విద్య, వినోదం, వాణిజ్యం, మార్కెటింగ్, శాస్త్రీయ అవగాహన, సృజనశీల కళ, గేమింగ్, సిమ్యులేషన్, సినిమా, షార్ట్ ఫిల్మ్, మెడికల్, రిటైల్, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ లాంటి రంగాల్లో అనంతమైన అవకాశాలు మరియు ప్రయోజనాలు ఉన్నాయి. నిజ జీవితాన్ని నకలు చేస్తూ బొమ్మలలో కదలికలతో చిత్రాలు తీయడాన్ని ఆనిమేషన్ నైపుణ్య కళ అంటారు. వాస్తవికతకు ఊహను జోడించి అందరికీ అర్థం అయ్యేలా సరళ వినోదాత్మక చిత్రాల ద్వారా సందేశాన్ని ఇవ్వడం ఆనిమేషన్ ప్రత్యేకత. స్వల్ప వ్యవధిలో అధిక ప్రభావం చూపగల సామర్థ్యం ఆనిమేషన్ కళకు ఉంటుంది. ఆనిమేషన్‌లో సంప్రదాయ, 2డి, 3డి, మోషన్ గ్రాఫిక్స్, స్టాప్ మోషన్, కటౌట్ అండ్ కల్లాజ్, రోటోస్కోపింగ్, సెల్ ఆనిమేషన్ మె?దలగు రకాలు ఉన్నాయి. సాధారణ జనులకు మరియు వ్యాపారవర్గాలలో ఆనిమేషన్ కళ ప్రధాన భూమిక నిర్వహిస్తున్నది. డిజిటల్ విప్లవం మరియు అంతర్జాల ప్రభంజన నేపథ్యంలో ఆనిమేషన్ కళకు అపార ఆదరణ లభించింది. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా, ముఖ్యంగా సినిమా మరియు టివీల్లో ఆనిమేషన్ కళ ప్రవేశంతో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

అన్ని వర్గాల మరియు వయసుల ప్రజలను ఆనిమేషన్ కళ ఆకర్షిస్తున్నది. ఆనిమేషన్ వీడియోలతో సందేశాలను సులభంగా ఇవ్వడం, ఊహాత్మక పరిధికి అవధులు లేక పోవడం, సృజనశీలత పెరగడం, వైద్యరంగంలో వినియోగపడడం, ఆకర్షణీయంగా ఉండడం, సులభంగా అవగాహనకు రావడం, వాణిజ్య ప్రకటనలతో ఆకర్షించడం, తేలికగా వేగంగా ప్రజలకు చేరడం, కంటికి ఇంపైన రంగుల చిత్రాలు తీయగలగడం లాంటి ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. 1906లో స్టువార్ట్ బ్లాక్టన్ మె?దటి ఆనిమేషన్ చిత్రం 'హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్' తీయడం జరిగింది. 1928లో వాల్ట్ డిస్నీ 'స్టీంబోట్ విల్లి' అనబడే ప్రథమ ఆనిమేటెడ్ కార్టూన్ ఫిల్మ్ తీయడం జరిగింది. 1937లో మె?దటి పూర్తి నిడివిగల ఆనిమేటెడ్ 'స్నోవైట్' అనే చలనచిత్రాన్ని వాల్ట్ డిస్నీ తీశారు. 1993లో 3డి ఆనిమేషన్ సాఫ్ట్ వేర్ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక యువత ఆనిమేషన్ కళ పట్ల ఆసక్తిని పెంచుకొని, ఆ రంగాన్ని తమ వృత్తిగా ఎంచుకొని, మరింత సృజనను జోడించి ప్రపంచ మానవాళికి నవ్య ఆనిమేషన్ రుచులను చూపుతారని ఆశిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

బురదతోనే కాలనీ వాసుల సహవాసం

ఇళ్లు శుభ్రం చేసుకునే పనిలో నిత్యం బిజీ
పక్షం రోజులైనా గాడిన పడని జీవితం
వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం

హైదరాబాద్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): కుండపోత వానలతో అతలాకుతలమైన హైదరాబాద్ లోని పలు కాలనీలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఎవరికి వారు తమ ఇళ్లను, ఇంటిముందు వీధులను శుభ్ర చేసుకునే పనిలో పడ్డారు. అనేక కాలనీల్లో ఇంకా రెండు, మూడు అడుగుల మేర నీళు నిలిచిఉండగా.. వందల సంఖ్యలో కాలనీలు, అక్కడి ఇండ్లు బురదతో నిండిపోయి ఉన్నాయి. దాదాపు రెండు వారాలు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. తమకు సర్కారు సాయం అందడం లేదని, ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. కాలనీల్లోని రోడ్లపైనే కాదు.. ఇండ్లలోనూ ఒకటి రెండు ఫీట్ల మేర బురద పేరుకుని ఉండటంతో క్లీన్ చేసుకునే పనిలో పడ్డారు. లక్షల విలువ చేసే సామాన్లు కొట్టుకుపోయాయని, తినడానికి తిండి కూడా లేదని ప్రజలు బాధను వ్యక్తం చేస్తున్నారు. వరద బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్న సర్కారు కొన్ని కాలనీలనే పట్టించుకుంటోందని.. చాలా కాలనీల పరిస్థితి దారుణంగా ఉందని బాధితులు వాపోతున్నారు. వానలు ఆగిపోయి వారం అవుతున్నా బురద తొలగించడానికి, సహాయక చర్యలు చేపట్టడానికి అధికారులు రాలేదని మండిపడుతున్నారు. జీహెచ్ఎంసీ వాళ్లను అడిగితే పండుగ సెలవులని అంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బురదను జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా తొలగిస్తున్నామని.. ఇండ్లలో బురద క్లియర్ చేసుకోవడానికి స్వచ్ఛంద సంస్థల వాళ్లు, ప్రతిపక్షాల కార్యకర్తలు సాయపడుతున్నారని చెప్తున్నారు. స్వచ్ఛంద సంస్థల వాళ్లు, స్థానికులు ఇస్తున్న ఫుడ్ తింటున్నామని అంటున్నారు. భారీ వర్షానికి వరద ముంచెత్తడంతో చాలా కాలనీల్లో జనం కట్టుబట్టలతో బయటికి వచ్చారు. షేక్ పేట, టోలిచౌకి, చాదర్ ఘాట్, ఫలక్ నుమా వంటి ఏరియాల్లోని కాలనీల్లో ముంపు తగ్గినా బురద పేరుకుపోయింది. మీర్‌పేట, సరూర్ నగర్ వంటి ప్రాంతాల్లో కొన్ని కాలనీలు ముంపులోనే ఉన్నాయి. వేల కుటుంబాలు వరద నీళ్లకు ఆగమైపోయాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పొద్దంతా బురద, చెత్త క్లీన్ చేసుకుంటున్నాం.. రాత్రి కాగానే చుట్టాల ఇంటికి పోతున్నమని చెబుతున్నారు. లాక్ డౌన్ వల్ల పనులు లేక ఆర్థికంగా దెబ్బతిన్న మాకు ఇప్పుడు ఇంట్లో సామానంతా పోయింది. టేబుల్స్, బీరువాలు, బెడ్ లు, బట్టలు అన్ని పాడైపోయాయి. తామే ఇల్లు క్లీన్ చేసుకుంటున్నట్లు తెలిపారు. భారీ వానల కారణంగా వరదలో మునిగిపోయిన వెహికల్స్ షెడ్లకు చేరాయి. బైకులు, ఆటోలు, కార్లు అనే తేడా లేకుండా లోతట్టు ప్రాంతాల్లోని వెహికల్స్ అన్నీ పాడయ్యాయి. కొన్నిచోట్ల కొట్టుకుపోయి పనికి రాకుండా పోయాయి. రిపేర్లకు వేలల్లో ఖర్చవుతుండగా ఓనర్లకు ఆర్థిక భారంగా మారింది. ఇన్సూరెన్స్ ఉన్న వెహికల్స్ వారు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కంపెనీలు రూల్స్ పేరిట కొర్రీలు పెడుతున్నాయి.

రిపేర్లకు వేల రూపాయల్లో ఖర్చు అవుతోంది. టూ వీలర్లకు రూ.3 వేల నుంచి రూ.15 వేలు, ఆటోలకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు, కార్లకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అవుతోంది. మునిగిన వెహికల్స్‌లో ఇంజిన్ ప్రాబ్లమ్సే ఎక్కువగా ఉంటున్నాయని మెకానిక్‌లు చెబుతున్నారు. వరదల కారణంగా దాదాపు 2.4లక్షల ఆటోలు, కార్లు, 5 లక్షల బైకులు నీట మునిగాయనే అంచనా ఉంది. వరదల్లో కొట్టుకుపోయిన వెహికల్స్‌కు కొన్ని కంపెనీలు పరిహారం ఇస్తుండగా, మరికొన్ని కంపెనీలు ఇవ్వడం లేదు. ఇప్పటికీ అన్ని సర్వీసింగ్ సెంటర్లలో ఫుల్‌గా ఉన్నాయి. దీంతో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో రొటీన్ సర్వీసింగ్ పనులు చేయలేకపోతున్నారు. నీట మునిగిన ఆటోల డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, సిటీలో చాలా మంది ఆటో డ్రైవర్లు ఇన్సూరెన్స్ చెల్లించే స్థోమత కూడా లేదని వాపోతున్నారు. పాడైన ఆటోల ఖర్చులను ప్రభుత్వం భరిస్తేనే ఆర్థికంగా నిలబడతారని అన్నారు.

పారదర్శకంగా సేవలందించాలి

– రికార్డుల నమోదు తప్పనిసరి
– జిల్లా అదనపు కలెక్టర్ అంజయ్య

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 27 (నేటినిజం ప్రతినిధి):ప్రభుత్వం అందించే సేవలను లబ్ధిదారులకు పారదర్శకంగా అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ అంజయ్య అన్నారు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు అంగన్వాడి కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు కేంద్రంలో నమోదైన లబ్ధిదారులు వారికి అందుతున్న సేవలను సి డి పి ఓ అలేఖ్య పటేల్ను అంగన్వాడి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు బాలింతలు గర్భిణుల కు ప్రభుత్వం నుండి సరఫరా అవుతున్న సేవలను సకాలంలో అందించి పోషణ లోపాలు లేకుండా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం రికార్డులను నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల సిడిపిఓ అలేఖ్య పటేల్, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఓటర్లలో కరోనా భయం

ముందస్తు ఓటింగ్‌లో అధికుల ఓటు

వాషింగ్టన్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): పోలింగ్‌కు మరో వారం రోజుల గడువు మాత్రమే ఉండటంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల వేడి పతాక స్థాయికి చేరింది. కరోనా ఉధృతి వేళ పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేసేందుకు భయపడుతున్న అమెరికన్లు బ్యాలెట్, ఈమెయిల్ ద్వారా ముందస్తుగా రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. అమెరికాలో మొత్తం 17 కోట్ల మందికి పైగా ఓటర్లు ఉండగా అందులో దాదాపు 5కోట్ల 90లక్షల మందికి పైగా ఓటు వేశారు. అమెరికాలో ఇప్పటివరకు నమోదు కానంత స్థాయిలో టెక్సాస్ రాష్ట్రంలో అత్యధిక ముందస్తు ఓటింగ్ శాతం నమోదైంది. పోలింగ్ శాతం గతంలో కంటే భారీగా నమోదవుతోంది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటేసేందుకు భయపడుతున్న అమెరికన్లు.. బ్యాలెట్, ఈ మెయిల్ ద్వారా ముందుగానే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఇక ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా ముఖ్యమైనదే. అందుకే ఎన్నికల్లో ఓటు వేయడానికి రాలేని వారికి సుదూర ప్రాంతాలలో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పిస్తారు. అమెరికన్ మహిళా వ్యోమగామి కేట్ రూబిన్స్ అంతరిక్ష కేంద్రం నుంచి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. నవంబర్ 3వ తేదీన జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఆమె తన ఓటు వేశారు. ఓటింగ్ జరిగే రోజున తాను స్పేస్‌లో ఉంటానని అందుకే ఈ ఓటు వేసినట్లు రూబిన్స్ చెప్పింది. మొత్తం 24 కోట్ల మంది ఓటర్లలో దాదాపు నాలుగోవంతు ఓటర్లు ముందస్తుగా ఓటుహక్కు వినియోగించుకోవడం అమెరికా చరిత్రలోనే ఓ రికార్డు. ఇంకా చెప్పాలంటే 2016లో పడిన మొత్తం ఓట్లలో 42 శాతం ఈసారి ఎన్నికల్లో ముందస్తుగానే బ్యాలెట్లకు చేరాయి. 16 కీలక రాష్ట్రాల నుంచే ఈ మొత్తం ఓట్లు పడ్డాయి. కరోనావైరస్ ఉధృతంగా కాటేస్తుండడంతో బయటకు– అంటే పోలింగ్ కేంద్రాలకు రావడానికి సాహసించని ఓటర్లు ఈసారి పోస్టల్, ఈమెయిల్ బ్యాలెటింగ్‌కు మొగ్గుచూపారు. నవంబరు 3నాటికి ఈ సంఖ్య మరింత పెరగొచ్చంటున్నారు.

ఈ ముందస్తు ఓటింగ్ కారణంగా ఫలితాల వెల్లడి ఆలస్యం కావొచ్చని, ఎందుకంటే మొత్తం పోలింగ్ పూర్తయ్యాకే పోస్టల్, మెయిల్ ఓట్ల లెక్కింపు కూడా మొదలవుతుందని, ఈ లెక్కింపునకు కాస్త ఎక్కువ సమయం పడుతుందని, పోలింగ్ జరగిన రోజు రాత్రే వెలువడడం అసాధ్యమని, కొన్ని రోజులపాటు సాగొచ్చని ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ వర్గాలను ఉటంకిస్తూ సీఎన్ఎన్ తెలిపింది. ఇది 2016 కంటే ఎక్కువగా అరాచక పరిస్థితులకు దారితీసినా ఆశ్చర్యపోనక్కరలేదని పేర్కొంది.

దుబ్బాకలో ప్రజలను భయపెడుతున్నారు

ఓటేయకుంటే పథకాలు ఊడుతాయని బెదరింపులు
కరీంనగర్‌లో సంజయ్‌ను పరామర్శించిన డికె అరుణ
ప్రధాని కళ్లు తెరిస్తే కెసిఆర్ జైలుకే అన్న బాబూ మోహన్

కరీంనగర్,అక్టోబర్27(ఆర్ఎన్ఎ): కరీంనగర్‌లో బండి సంజయ్ దీక్షతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆయన స్వీయనిర్బంధంలోకి వెళ్లడంతో బిజెపి నేతలు పరామర్శించారు. వివిధ జిల్లాల నుంచినేతలు వచ్చి పరామర్శించారు. మాజీమంత్రులు డికె అరుణ, బాబూ మోమన్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ దుబ్బాక ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓటమి పాలు కాబోతోందని జోస్యం చెప్పారు. ఈ విషయం సర్వేల్లో తేలడంతోనే ఆ పార్టీ అరచకాలు చేసి గెలవాలనుకుంటోందని ధ్వజమెత్తారు. పోలీసులను అడ్డుపెట్టుకుని టీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ లేని సిద్దిపేటలో బీజేపీ అభ్యర్థుల బంధువుల ఇళ్లలో అప్రజాస్వామికంగా సోదాలు చేశారన్నారు. దుబ్బాకలో బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. అధికారంలో ఉన్న టీఆర్ఎస్ సొంత సీటును కాపాడుకునేందుకు దురాగతాలు చేస్తోందని ధ్వజమెత్తారు. అక్కడ ప్రజలు టీఆర్ఎస్ కు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు ఇవ్వబోమని దుబ్బాక ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఓడిపోతామని తెలిసి సీఎం మైండ్ గేమ్ ఆడుతున్నాడన్నారు. దుబ్బాక ఫలితం రానున్న 2023 ఎన్నికల ఫలితాలకు అద్దం పట్టబోతోందన్నారు. ఎందుకోసం తెలంగాణ కోరుకున్నామో అవేవీ నెరవేరలేదన్నారు. టీఆర్ఎస్ నియంతృత్వ పోకడను ప్రజలు అర్థం చేసుకున్నారని అరుణ అన్నారు. దుబ్బాకలో కనీస అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్రం నుంచి డబ్బులు రాలేదని, వ్యవసాయ మీటర్లు పెడుతారని హరీశ్ అబద్దాలు చెబుతున్నాడని మండిపడ్డారు. కేంద్ర నిధులు రాలేదని ఆర్థిక మంత్రి రాతపూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కంటే హరీష్ ఎక్కువ అబద్దాలు చెబుతున్నాడన్నారు. అబద్దాల్లో వీళ్లకు డాక్టరేట్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. ప్రధాని ఒక్కసారి కన్నెర్ర జేస్తే మీరు జైల్లో ఉంటారనే విషయం గుర్తుంచుకోవాలని బీజేపీ నాయకుడు, సినీ నటుడు బాబు మోహన్ హెచ్చరించారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో మంత్రి హరీష్ రావు తెలంగాణ రాష్ట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పై పోలీసులను ఉసిగొల్పి దాడి చేయించాడని ఇది చాలా హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. హరీశ్ రావు చిన్న పిల్లాడిలాగా ప్రస్టేషన్ తో మాట్లాడుతున్నాడన్నారు. దుబ్బాకలో ఓటమి భయంతోనే ఇలాంటి అలజడులు రేపుతున్నారని ఆరోపించారు. ఆడవాళ్లు, పిల్లలని చూడకుండా పోలీసులు అతిగా ప్రవర్తించారు.. హుందాగా ఉండాల్సిన సీపీ అత్యుత్సాహం చూపించారు. సిద్దిపేటలో సోమవారం జరిగిన ఘటనపై చర్యలు తప్పవు. ఇలాంటి పరిస్థితి మీకు ఎదురవుతుందన్నారు. సిద్దిపేట, గజ్వేలులాగా దుబ్బాక ఎందుకు అభివృద్ధి చేయలేదు? అని ప్రశ్నించారు. రఘునందన్ రావు గెలిస్తే దుబ్బాక అభివృద్ధి ఖాయం అని జోస్యం చెప్పారు. అధికారం ఉందని ఇలాగే చేస్తే ప్రధాని కన్నెర్రజేస్తే మీరు జైల్లో ఉంటారని గుర్తుంచుకోవాలని.. దుబ్బాక ఫలితంతో మీ పునాదులు కదలబోతున్నాయని బాబు మోహన్ హెచ్చరించారు.

బిహార్ నూతన ప్రభుత్వ ఏర్పాటులో కీలకం కానున్న జిడిఎస్ఎఫ్ కూటమి

–సీమాంచల్‌ను సిఎం నితీష్ సర్కార్ నిర్వీర్యం చేసింది
–ధనవంతులకు తప్ప పేదలకు చదువును దూరం చేశారు
–ఉపాధి కోసం బిహారీలను వలస బాట పట్టించారు
–అమూర్ అసెంబ్లీ ఎన్నికల ఇంచార్జ్ సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 27 (నేటినిజం ప్రతినిధి):బిహార్ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో నూతన ప్రభుత్వ ఏర్పాటు లో ఎంఐఎం ఆధ్వర్యంలో ఏర్పడిన గ్రాండ్ డెమొక్రటిక్ సెక్యులర్ ఫ్రంట్ (జి డి ఎస్ ఎఫ్) కీలకంగా మారనుందని కరీంనగర్

ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. బిహార్ రాష్ట్ర ఎంఐఎం అధ్యక్షుడు అక్తరుల్ ఈమాన్ ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ గంజ్ జిల్లా అమూర్ అసెంబ్లీ స్థానం ఇంచార్జ్గా గులాం అహ్మద్ హుస్సేన్, తెలంగాణ హజ్ కమిటీ డైరెక్టర్ అంజద్ అబూ తలహా లు వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం అహ్మద్ హుస్సేన్ ఫోన్ లో మాట్లాడారు. అనేక రకాల సంపదలు ఉన్న బిహార్ రాష్ట్రాన్ని బీదల రాష్ట్రం గా ప్రస్తుత, గత పాలకులు మార్చారని, ఇక్కడ విద్యను ధనవంతుల పిల్లలకు వరంగా పేద పిల్లలకు శాపంగా మారిందని, నితీశ్ కుమార్ సర్కార్ రాష్ట్రంలో మౌళిక వసతులు, బీద, మధ్య తరగతి ప్రజలకు కనీస ఉమ్మడి ప్రణాళికతో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకల్పనలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బిహారీలు ఉపాధి వేటలో దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలకు వలస వెళ్ళిపోతున్న దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమికి వారుఆశించిన స్థాయిలో ప్రజా స్పందన లేదన్నారు. తమ అధినేత అసదుద్దీన్ ఒవైసీ రోజు 5 బహిరంగ సభల్లో పాల్గొంటున్నారని ఊహించని విధంగా అనూహ్యమైన ప్రజా స్పందన లభిస్తుందన్నారు. సీమంచ ప్రజలు ఎంఐఎం ఆధ్వర్యంలో ఏర్పడిన నూతన కూటమి వైపు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. సీమాంచల్ అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో తమ ఎజెండా ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళుతున్నామని అన్నారు. జి డి ఎస్ ఎఫ్ కూటమి అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రేటర్ అట్లాంటాలో ఘనంగా దసరా సంబురాలు

అట్లాంటా, అక్టోబర్ 26: గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 24 వరకు బతుకమ్మ, దసరా సంబురాలు వైభవంగా జరిగాయి. వర్చువల్ పద్ధతిలో సీడీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించారు. 15 ఏండ్లుగా సొసైటీ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుతున్నామని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణతోపాటు అమెరికాకు చెందిన గాయనీగాయకులు బతుకమ్మ పాటలతో శ్రోతలను అలరించాయి. సొసైటీ అధ్యక్షుడు రాహుల్చి క్యాల గేట్స్ సంస్థ కార్యాక్రమాలను వివరించారు. చైర్మన్ అనిత నెల్లుట్ల బతుకమ్మపండుగ విశిష్టతను తెలిపారు. బతుకమ్మ పోటీలకు జడ్జిలుగా కళ్యాణిముకోటి, మీనాక్షి వ్యవహరించారు. ప్రథమ బహుమతి తెలంగాణ ఆడపడుచుల బృందం సాధించింది.

కల్పనబట్టు, పార్వతీ చిక్యాల, లావణ్య జోగినిపల్లి, శిరీష జూలపల్లి, లక్ష్మిపానుగంటి, నిర్మల తాళ్లపల్లికి ప్రథమ బహుమతిని ప్రదానం చేశారు. అనితానెల్లుట్ల బృందానికి లక్ష్మిపోనుగోటి, నిర్మల్‌కు చెందిన గొల్లపల్లి గ్రూప్ ద్వితీయ బహుమతిని అందజేశారు. మూడోబహుమతి పన్నెల, మంజులకు మన గ్రూప్స్ సంస్థ అందజేసింది. నాలుగోబహుమతిని హారికబత్తిని బృందం అందజేశారు. గేట్స్ కోశాధికారి, జనార్ధన్ పన్నెల, సాంస్కృతిక కార్యదర్శి శ్రీనివాస్ పర్సా కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. డాక్టర్లింగ శ్రీనివాస్, డాక్టర్లు రూప, గ్రాజల్స్, శ్రిష్టిచిల్ల, రేలారెలా జాన్, దండేపల్లి శ్రీనివాస్, రేల నాగరాజు బృందం, వరం (వీ6-2016 ఫేమ్), శ్రీనివాస్ దుర్గం, స్రవంతి, ప్రముఖ జానపద గాయకుడు జనార్ధన్ పన్నెల, గేట్స్ కోశాధికారితోపాటు నృత్యఅకాడమీ నీలిమగడ్డ మణుగు, నటరాజ నాట్యాంజలి సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బోర్డు సభ్యులకు, సలహాదారులకు, కమిటీ చైర్మన్లు, వాలంటీర్లు, గాయకులు, డ్యాన్స్ అకాడమీలు, మీడియాభాగస్వాములకు, గేట్స్ సంస్థ కుటుంబాలతోపాటు స్పాన్సర్లు, సలహాదారులకు గేట్స్ ఈసీ, బీఓడీ శ్రీనిగంగాసాని, సతీష్ చీటి, ప్రభాకర్ బోయపల్లి, కరుణకర్ ఆసి రెడ్డి, శ్రీజన్ జోగినిపల్లి, వెంకట్ వీరనాని, రతన్, నరేందర్ రెడ్డి, శ్రీధర్ నరులధా, బోడి రెడ్డి, తిరుమాల్ పిట్ట తదితరులు ధన్యవాదాలు తెలిపారు.పబ్లిసిటీలీడ్, గణేష్ కాసం, టీవీ9, టీవీ ఆసియా టెలికాస్టలతోపాటు సహకరించిన శివకుమార్ రామడుగుతోపాటు దసరా వేడుకలకు దాతలుగా వ్యవహరించిన అండ్జెటిల్స్, సువిధ ఇంటర్నేషనల్ మార్కెట్, గౌథం గోలీ (రాపిడ్ ఐటి), ప్లాటినం స్పాన్సర్, డాక్టర్శిని గంగాసాని, ఎడ్డురు అకాడమీ, బతుకమ్మ బహుమతుల స్పాన్సర్లు రమణగాండ్ర, రామకృష్ణగాండ్ర, శరత్ గాండ్ర, సవీన్ ఉజ్జినికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలోరాహుల్చి క్యాల (అధ్యక్షుడు), అనితా నెల్లుట్ల (చైర్మన్), కిషన్తల్లాపల్లి (వైస్ ప్రెసిడెంట్), సునీల్ గోటూర్ (ప్రధాన కార్యదర్శి), జనార్ధన్ పన్నేల (కోశాధికారి), శ్రీనివాస్ పర్సా (సాంస్కృతిక కార్యదర్శి), చలపతి వెన్నెల (ఈవెంట్ సెక్రటరీ), ప్రభాకర్ మధుపాటి (స్పోర్ట్స్ సెక్రటరీ), శ్రీధర్నలవెల్లి (డైరెక్టర్), రఘుబందా (డైరెక్టర్), రామాచారి నక్కర్తి (డైరెక్టర్), చిత్తారిపబ్బా (డైరెక్టర్), నవీన్ బత్తిని (డైరెక్టర్), గణేష్ కాసం (డైరెక్టర్), సందీప్ గండ్ల (డైరెక్టర్), అన్నికమిటీ చైర్లు పాల్గొన్నారు.

రోడ్లను మరింత బాగు చేయాలి : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, అక్టోబర్ 21: ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై)-ఫేజ్ 3, బ్యాచ్ -1 పనులను వెంటనే గ్రౌండ్ చేయాలి అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులను ఆదేశించారు. పీఎంజీఎస్‌వై బ్యాచ్ -2 పనులకు ప్రతిపాదనలు కేంద్రానికి త్వరితగతిన పంపించాలి. తద్వారా మరిన్ని రోడ్లను మన రాష్ట్రానికి తెచ్చుకోవాలి. రోడ్లు లేని మరిన్ని గ్రామాలకు రోడ్లు వేసుకోవాలి. ఉన్న రోడ్లను మరింతగా బాగు చేసుకోవాలి అని మంత్రి సూచించారు.

హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పీఆర్ ఈఎన్‌సీ సత్యానారాయణ రెడ్డి, పీఎంజీఎస్‌వై సీఈ సంజీవరావు, ఎన్ఆర్ఈజీఎస్ సీఈ హన్మంతరావు, తదితర అధికారులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమావేశమయ్యారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పనుల ప్రగతి, రైతు వేదికలు, రైతుల కల్లాలు, పీఎంజీఎస్‌వై రోడ్ల అన్ గోయింగ్ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై ఫేజ్-3 కింద రాష్ట్రానికి రూ.658 కోట్ల అంచనా వ్యయంతో 2,427.5 కి.మీ రోడ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది అని తెలిపారు. వాటిలో బ్యాచ్ -1 కింద 1,119.94 కి.మీ.కు 152 పనులు మంజూరు అయ్యాయి. ఈ పనుల టెండర్లు ముగిశాయి. త్వరితగతిన ఈ పనులను చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని అధిక